


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 22-08-2019 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 42 సంచిక : 298 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## కొండవీటి వాగుతో రాజధానికి ముంపు వస్తుంది

- సీఎం జగన్ ఆ విషయం ముందేచెప్పారు
- ఏ నిర్ణయం తీసుకున్నా ప్రధాని, అమిత్‌షాలకు చెప్తారు
- వైకాపా ముఖ్యనేత, ఎంపీ విజయసాయిరెడ్డి



దిల్లీ: భారీ వర్షాలు, వరదలు వచ్చినపుడు కొండవీటి వాగు వల్ల రాజధాని అమరావతి ముంపునకు గురయ్యే ప్రమాదముందని వైకాపా ముఖ్యనేత, ఎంపీ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానికంగా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో దేశానికి వరదలు ఏర్పడినప్పుడు రాజధాని ప్రాంతం తీవ్ర ముంపునకు గురవుతుందని సీఎం జగన్ మోహన్ రెడ్డి ముందే చెప్పారని మీడియా సమావేశంలో పేర్కొన్నారు.

ఏపీ సీఎం జగన్ ఏ నిర్ణయం తీసుకున్నా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సంప్రదించే తీసుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వం అవినీతికి పాల్పడి రాష్ట్ర ఖజానాను దోచుకుం దని.. బాధ్యులైన వారందర్నీ చట్టపరిధిలోకి తీసుకురావాలనేదే తమ దృఢ సంకల్పమన్నారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. అవినీతి నివారణలో తమ సంకల్పానికి మోదీ, అమిత్‌షా ఆశీస్సులు ఉన్నాయని వ్యాఖ్యానించారు. పోలవరం రివర్స్ టెండరింగ్, పీపీఏ అంశాల్లోనూ ప్రధాని మోదీతో మాట్లాడాకే సీఎం నిర్ణయం తీసుకున్నారన్నారు.

రాజధానిపై ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటే తప్పకుండా మీడియాకు చెబుతుంది కదా అని విజయసాయి రెడ్డి వ్యాఖ్యానించారు. ఇంతవరకు తీసుకోని నిర్ణయంపై చర్చ అనవసరమన్నారు.

భారీ వర్షాలు, వరదలు వచ్చినపుడు కొండవీటి వాగు వల్ల రాజధాని అమరావతి ముంపునకు గురయ్యే ప్రమాదముందని చెప్పారు. పోలవరం రీటెండరింగ్, పీపీఏ వ్యవహారాల్లో తెదేపా నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని.. దాన్ని నమ్మవద్దని ఆయన హితవు పలికారు.

## ఏపీ రాజధాని మార్పుపై కేంద్రం నిర్ణయం తీసుకోదు

### తెలంగాణలో అధికారమే భాజపా లక్ష్యం

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్ : నవ్యాంధ్ర రాజధాని మార్పుపై చర్చ నడుస్తున్న సమయంలో ఈ అంశంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. ఏపీ రాజధాని మార్పుపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోదని ఆయన స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో సనత్‌నగర్ ఈఎస్ఐసీలో రూ.150 కోట్లతో కొత్త బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ రాజధాని మార్పు నిర్ణయం కేంద్రం పరిధిలోకి రాదని పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్ దేశానికి రెండో రాజధాని అంటూ వస్తున్న వార్తల్లో కూడా వాస్తవం లేదన్నారు. తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆరోగ్యశ్రీ మంచి కార్యక్రమం అయితే ధర్నాలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు.

**నడ్డా ఎవరో తెలియనప్పుడు ఆయన్నెలా కలిశారు?**

భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా ఎవరో తెలియదనడం మంచి సంస్కృతి కాదన్నారు. నడ్డా ఎవరో తెలియదనడం కేటీఆర్ అహంకార వైఖరికి నిదర్శనమని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఆయనెవరో తెలియనప్పుడు గతంలో కేటీఆర్ నడ్డాను ఎలా కలిశారని నిలదీశారు. రాష్ట్రంలో భాజపా లేకపోతే కవిత ఎలా ఓడిపోయారు? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

**మా లక్ష్యం మున్సిపల్ ఎన్నికలు కాదు..**

తమ పార్టీ లక్ష్యం మున్సిపల్ ఎన్నికలు కాదని కిషన్ రెడ్డి స్పష్టంచేశారు. 2023లో తెలంగాణలో అధికారంలోకి రావడమే భాజపా లక్ష్యమన్నారు.

## ఉగాది నాటికి పేదలకు ఇళ్ల స్థల పట్టాల పంపిణీకి చర్యలు!

- నివాసానికి యోగ్యంగా ఉన్న స్థలాలను ఎంపిక చేయాలి
- గ్రామ సచివాలయ ఉద్యోగాల పరీక్షలకు పగడ్బంది ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
- ఎల్.వి.సుబ్రహ్మణ్యం వీడియో కాన్ఫరెన్స్‌లో వెల్లడి



విశాఖ సిటీః ఉగాది నాటికి పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి. సుబ్రహ్మణ్యం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం ఇళ్ల స్థలాలు, గ్రామ సచివాలయ ఉద్యోగాల పరీక్షలపై విజయవాడ నుండి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాసానికి యోగ్యంగా ఉన్న ఇళ్ల స్థలాలను గుర్తించాలన్నారు. మౌళిక సదుపాయాలను తక్కువ ఖర్చుతో కల్పించే అవకాశం ఉండే స్థలాలను పరిశీలించాలని తెలిపారు. నవరత్నాల కార్యక్రమంలో ఇళ్ళ స్థలాల పంపిణీ ఒక అంశమని పేర్కొన్నారు. చెరువులను ఇళ్ల స్థలాల కోసం ఎంపికచేయకూడదని చెప్పారు. వాలంటీర్లు గ్రామ, వార్డుల్లో ఇంటింటికి వెళ్లి అర్హులైన లబ్దిదారులను గుర్తించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించినట్లు చెప్పారు. నివాసానికి అనుకూలంగా ఉండే భూమిని, అభ్యంతరాలు లేని భూమిని గుర్తించినట్లు ఆయన వివరించారు. సెప్టెంబరు 1వ తేదీ నుండి జరుగబోయే గ్రామ సచివాలయ ఉద్యోగాల పరీక్షలకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ తరువాయి 2లో..

## వాసిరెడ్డి పద్మకు క్యాబినెట్ హోదా



అమరావతి: ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మకు ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 8వ తేదీన ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ నియమితులయిన విషయం తెలిసిందే.

## పూర్తి చేసిన అభివృద్ధిపనుల జాబిను సత్వరమే అందజేయండి

### విఎంఆర్డిఏ పనులపై సమీక్షించిన రాష్ట్ర మంత్రి ముత్తంశెట్టి



విశాఖ సిటీ: విఎంఆర్డిఏ ద్వారా చేపట్టి పూర్తయిన పనులను ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు తెలిపారు. బుధవారం గవర్నర్ బంగ్లాలో విఎంఆర్డిఏ చైర్పర్సన్ ద్రోణంరాజు శ్రీనివాస్ రావుతో కలిసి విఎంఆర్డిఏ తరువాయి 2లో..

## వరదలకు భయపడే 'బాబు' హైదరాబాద్‌కు వెళ్లిపోయారు



అమరావతి : వరదల్లో ఇల్లు మునిగి పోతుందని తెలిసే చంద్రబాబు హైదరాబాద్ పారిపోయారని ప్రతిపక్ష నేత చంద్రబాబుపై ఎమ్మెల్యే అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాగార్జునసాగర్ గేట్లు మూసేసిన తర్వాతనే విజయవాడకు తిరిగొచ్చారని ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో అంబటి బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. బాబు ధోరణి తరువాయి 2లో..

## వరద నష్టరైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- బాబు ఇంటిని ముంచారనడం సిగ్గుచేటు
- మంత్రి, జిల్లా ఇంచార్జి కురసాల కన్నబాబు హామీ



కృష్ణా: వరదల వల్ల నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి, జిల్లా ఇంచార్జి కురసాల కన్నబాబు హామీ ఇచ్చారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. మంత్రి మాట్లాడుతూ అధికారులు పంటనష్టంపై అంచనాలు రూపొందిస్తున్నారని, రైతులందరికీ నష్ట పరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు. రైతులకు అండగా ఉండాలన్నదే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. రైతులకు వంద శాతం సబ్సిడీపై విత్తనాలు ఇస్తామన్నారు. ఇక ప్రతిపక్ష నేత చంద్రబాబు.. కృత్రిమ వరదను సృష్టించారనడం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. రైతుల బాధలు వినకుండా తన ఇంటిని ముంచారనడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యేలు కైలే అనిల్ కుమార్, కొలుసు పార్థసారథి, కొక్కిలిగడ్డ రక్షణనిధి, వ్యవసాయ కమిషనర్ అరుణ్ కుమార్ వెంట ఉన్నారు.

## పాత నోట్లతో కొత్త బేరం

- కమీషన్ ఇప్పిస్తామని ఆశ చూపిస్తారు..
- డీల్ కుదరకుంటే అంతు చూస్తామని బెదిరిస్తారు..
- 14మంది సభ్యుల ముఠా అరెస్టు..
- కోటి 97 వేల రూపాయలు స్వాధీనం
- నగర పోలీసు కమిషనర్ ఆర్.కె. మీనా..



శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి విశాఖకు చేరుకుని స్థానికులకు పాతనోట్లు ఇచ్చి వాటిని చెలామణి చేస్తే 15 శాతం కమీషన్ ఇస్తామని దొంగనోట్ల ముఠా ఎరచూపారు. కమీషన్ డీల్ కుదరకుంటే అంతు చూస్తామని బెదిరింపులకు దిగారు. పోలీసులు వలపన్ని ఆ ముఠాను చాకచక్యంగా పట్టుకున్నారు.

( వివరాలు 2వ పేజీలో.. )



# ఈకేవైసి నమోదుకు తగినన్ని ఆధార్ సెంటర్లు లేక ఇబ్బందులు

## ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన జనసేన నాయకులు



నర్సీపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈకేవైసి నమోదుకు తగినన్ని ఆధార్ సెంటర్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, కావున ఆధార్ సెంటర్లు పెంచాలని కోరుతూ బుధవారం నర్సీపట్నం నియోజకవర్గ జనసేన నాయకులు నర్సీపట్నం ఆర్డీవో ఆర్.గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ నాయకులు రాజాన వీర సూర్యచంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఆధార్ సెంటర్లలో ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. కావున వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సాధికార సర్వే చేసే పరికరాలు సరిగా పని చేయకపోవడం వలన సర్వే చాలా ఆలస్యం అవుతుందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో ఉన్న అన్ని పంచాయతీల్లోను ఆధార్, సాధికార సర్వేలో 100 శాతం ప్రజలు నమోదు కాలేదన్నారు. అక్టోబర్ నుంచి మొదలు కానున్న గ్రామ సచివాలయ వ్యవస్థలో ప్రతి సచివాలయంలో ఆధార్, సాధికార సర్వే సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. 50 ఇళ్లకు తిరిగే వాలంటీర్లకు ఈకేవైసి పరికరాలు ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులందరికి బయోమెట్రిక్ అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు అద్దేపల్లి గణేష్, నర్సీపట్నం రూరల్ అధ్యక్షుడు వూడి చక్రవర్తి, నాతవరం మండలం అధ్యక్షులు గుడివాడ కృష్ణ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు టీడీపీ సమావేశం

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలో గురువారం టీడీపీ సమావేశం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు చెప్పారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో యలమంచిలి, రాంబిల్లి మండలాల నాయకులు, కార్యకర్తలకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

# నేడు మరిడమ్మ జాతర

నాతవరం: మండల కేంద్రమైన నాతవరంలో గురువారం కోటమ్మతల్లి జాతరకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తుంది. పండుగ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

## చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

మాకవరపాలెం: గ్రామాల్లో ఎటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా శిక్ష నుంచి తప్పించుకోలేదని మాకవరపాలెం ఎస్సై కరక రాము అన్నారు. మంగళవారం రాత్రి కొండలఅగ్రహారంలో పోలీసులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పేకాట, కోడిపందాలు నిర్వహించరాదన్నారు. అటువంటి వారిపై సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు సుర్ల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## ఉగాది నాటికి పేదలకు ఇళ్ల స్థల పట్టాల పంపిణీకి చర్యలు!

ప్రధాన కార్యదర్శి ఎల్.వి. సుబ్రహ్మణ్యం చెప్పారు. ఓ ఎమ్ ఆర్ షీట్లతోనే పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్ష పత్రాలను భద్రపరచుటకు స్ట్రాంగ్ రూమ్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఎపిపిఎస్సీ ద్వారా పరీక్ష పత్రాలు పంపిణీ చేయబడుతుందని, ఎక్కువ మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావచ్చని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని చెప్పారు. ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, పర్యవేక్షణ పక్కాగా ఉండాలని తెలిపారు. ఎలాంటి ఫిర్యాదులు, ఆరోపణలు రాకూడదని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఆయా కళాశాలలకు సెలవులు ఇచ్చే విధంగా ఉన్నత విద్యా శాఖ నుండి ఒక సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. పరీక్షల నిర్వహణ జరుగుతున్న విద్యా సంస్థలకు ఆయా రోజుల్లో సెలవులు మంజూరుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి. సుబ్రహ్మణ్యం తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్, విద్యుత్ సరఫరా, తాగునీరు, తదితర సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలను తహసిల్ధార్, ఎంపిడిఓలు పరిశీలించాలని చెప్పారు. అభ్యర్థుల రవాణాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. డిజిపి గౌతమ్ సవాంగ్ మాట్లాడుతూ పరీక్షలకు బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీలు, పోలీస్ కమీషనర్లను ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తం 21.69 లక్షల మంది పరీక్షలు రాస్తుండగా, మొదటి రోజునే 12.54 లక్షల మంది రాస్తున్నట్లు ఆయన వెల్లడించారు. విశాఖపట్నం నగర పోలీసు కమీషనర్ ఆర్.కె. మీన మాట్లాడుతూ నగరంలో మొత్తం 24 పరీక్ష కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. పంచాయతీ రాజ్ కమీషనర్ గిరిజాశంకర్ మాట్లాడుతూ అభ్యర్థులను పూర్తిగా చెక్ చేసి పరీక్ష హాల్ లోనికి పంపింపాలని, మహిళా అభ్యర్థులను చెక్ చేయుటకు అంగన్వాడీ కార్యకర్తలు, తదితర సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పంచాయితీరాజ్ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎల్. శివశంకర్, విఎంఆర్డిఎ కమీషనర్ కోటీశ్వరరావు, జివిఎంసి కమీషనర్ డా. సృజన, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీదేవి, జివిఎంసి సి.సి.పి. ఆర్.జె. విద్యుల్లత, జడ్.పి. సిఇఓ రమణమూర్తి, ఎన్.ఐ.సి మూర్తి, ఎపిఇపిడిసిఎల్ సూర్యప్రకాష్, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి శ్రీనివాసరావు, టిడ్కో ఎస్.ఇ., తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి చేసిన అభివృద్ధిపనుల జాబిను సత్వరమే అందజేయండి

పనులపై సమీక్షించారు. లా కాలేజీ వద్ద శ్రీరామ్ ప్రాపర్టీస్ రోడ్ నందు సెంట్రల్ లైటింగ్ ఈ నెల 23న ప్రారంభించనున్నట్లు తెలిపారు. మిగిలిన పనులు కూడా సత్వరమే పూర్తి చేయాలని, పూర్తి చేసిన పనుల జాబితాను అందజేయాలని విఎంఆర్డిఏ కమిషనర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ డా.సృజన, నర్సిపట్నం ఏం.ఎల్.ఎ పి. ఉమా శంకర్ గణేశ్, మళ్ళ విజయ ప్రసాద్, అక్రరమాని విజయనిర్మల, నగర వై.సి.పి అధ్యక్షుడు వంశీ కృష్ణ శ్రీనివాస్ తదితరులు హాజరైనారు.

## వరదలకు భయపడే 'బాబు' హైదరాబాద్ వెళ్లిపోయారు

లేరా. చేయినొప్పికే అక్కడిదాకా వెళ్లాలా. బాబు హైదరాబాద్ వెళితే మరి లోకేష్ ఎక్కడికి వెళ్లారు. నదీగర్భంలో ఉంటూ ఇల్లు ముంచేశారంటూ చంద్రబాబు మాట్లాడుతున్నారు. పేపర్లలో రాయించుకుంటున్నారు. కృష్ణా నదికి వరదలు సృష్టించడం మానవులకు సాధ్యమవుతుందా. అక్రమ కట్టడాలను కూల్చివేస్తామని టీడీపీ హయాంలో దేవినేని ఉమా ప్రకటించారు కదా. మరేమైంది. ఎన్ని కూల్చేశారు. ఏ అక్రమ కట్టడానికైతే టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నోటీసులు ఇస్తామన్నారో.. ఇప్పుడు అదే ఇంట్లో చంద్రబాబు ఉన్నారు.

అమెరికాలో జ్యోతి ప్రజ్వలన చేయలేదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని హిందూ వ్యతిరేకి అంటూన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా అసత్యాలు మాట్లాడ్డం నేరం. అక్కడ ఎలక్ట్రానిక్ పరికరం ద్వారా జ్యోతిని వెలిగిస్తారు. ఆయనా అదే చేశారు. కమల వనంలో చేరిన పచ్చ పుష్పాలు సీఎం జగన్‌పై విమర్శలు చేస్తున్నారు. సీఎం రమేష్ బీజేపీలో ఉన్న పచ్చ కోవర్ట్. విజయవాడ నడిబొడ్డున దేవాలయాలను చంద్రబాబు కూలగొట్టించినపుడు బీజేపీ నేత మాణిక్యాలరావు ఏమయ్యారు. సదావర్తి భూములను అన్యాయంగా వేలం పాట వేస్తే మాణిక్యాలరావు గుడ్లగూబలా చూస్తూ ఉండిపోయారు. పచ్చ రక్తంతో బీజేపీ తన సహజత్వం కోల్పోతుంది. ఆంధ్రప్రదేశ్‌లో కమల వనం కాస్తా పచ్చ వనంగా మారుతుంది. బీజేపీ నేతలు జాగ్రత్తగా ఉండాలి. సమయం వచ్చినప్పుడు వాళ్లంతా తిరిగి చంద్రబాబు పక్కనే చేరతారు.అన్నారు.

# హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ

నర్సీపట్నం: ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకు హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని నర్సీపట్నంలోని శ్రీవినాయక సూరెడ్డి ఆదినారాయణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కరస్పాండెంట్ నాగ ఉమామహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. పది మందికి ఉచిత శిక్షణకు అవకాశం కల్పిస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు 9493234212 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

## స్పోర్ట్స్ స్కూల్‌కి ఎంపికైన యలమంచిలి హాకీ క్రీడాకారిణి రమ్మశ్రీ



యలమంచిలి: యలమంచిలి హాకీ క్రీడాకారిణి బోణ రమ్మశ్రీ జూలైలో గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచి నందున విజయనగరం స్పోర్ట్స్ స్కూల్‌కి ఎంపికైనట్లు యలమంచిలి హాకీ ఆశోసియేషన్ ప్రతినిధి తెలిపారు. జూన్ గావియట్, చీఫ్ కోచ్, డి.ఎస్.ఎ విశాఖ వారు 2019 మే నెలలో యలమంచిలిలో ఈ. రవి, సీనియర్ హాకీ క్రీడాకారుడు ఎం ఐ ఎస్ కోచ్‌చే నిర్వహించిన సమ్మర్ హాకీ కోచింగ్ క్యాంప్ శిక్షణ పొందిన బాలిక బోజ రమ్యశ్రీ మొదట విశాఖ జిల్లా జట్టుకు ఎంపిక కాబడి ఆ తదుపరి రాష్ట్ర ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చినందుకు వివిధ వర్గాల వారు అభినందించారు.

# నేడు తెలుగుదేశం పార్టీ సమావేశం



యలమంచిలి : యలమంచిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహిస్తున్నమని ఎమ్మెల్సీ పప్పల చలపతి రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, మాజీ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, ఆడారి ఆనంద్ మరియు నియోజక వర్గములో యలమంచిలి, రాంబిల్లి మండలాల నాయకులు, కార్యకర్తలు అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు.

# కూలిన కల్వర్టు.. నిలిచిపోయిన రాకపోకలు



కోటవురట్ల: నర్సీపట్నం మండలం యరకన్నపాలెం నుంచి పాములవాకకు వెళ్లే రహదారిలోని కల్వర్టు సగానికి కూలిపోయింది. మిగతా సగం కూడా ఏ క్షణమైనా కూలిపోయేలా ఉంది. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కల్వర్టు శిధిలావస్థకు చేరుకొంది. కల్వర్టు కూలడంతో ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లేందుకు అవకాశం ఉండగా, బస్సులు, ట్రాక్టర్లు, ఆటోల రాకపోకలు స్తంభించాయి. దీంతో నర్సీపట్నం నుంచి పాములవాక మీదుగా తునికి వెళ్లే బస్సులు నిలిచిపోయాయి. దీంతో సుమారు 15 గ్రామాల ప్రజలకు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు పాఠశాల వెళ్లేందుకు, రైతులు పనులు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు పూర్తిగా కూలిపోతే నర్సీపట్నం వెళ్లేందుకు పూర్తిగా రాకపోకలు బంద్ కానున్నాయి. పాములవాక మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు కూలిన కల్వర్టును పరిశీలించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు వెంటనే స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని, తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డును నిర్మించాలని కోరారు.

## ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై

# అవగాహన కల్పిస్తున్న పోలీసులు



యలమంచిలి : యలమంచిలి పట్టణంలో బస్టాండ్ సమీపంలో గల ఆటో స్టాండ్‌లో గల ఆటోడ్రైవర్లతో పట్టణ ఎసైఐ నాగకార్తీక్ మట్లాడుతూ బస్టాండ్ సమీపంలో ఆటోలు నిలపడం, రహదారిపై ఎటువంటి ముందస్తు సిగ్నల్స్ లేకుండా రోడ్డుకు అడ్డంగా ఆటోలు ఆపేయడం వల్ల ఇతర వాహనదారులు ప్రమాదానికి గురి అవుతున్నారని వారికి వివరిస్తూ ఇకపై రోడ్డు మధ్యలో వాహనం నిలిపి ప్రమాదానికి కారణమైతే చర్యలు తప్పవన్నారు. సరైన ధ్రువపత్రాలు దగ్గర ఉంచుకోవడం, యూనిఫామ్ ధరించడం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో నాగకార్తీక్‌తో పాటు సిబ్బంది మధుబాబు, అర్జునరావు, అప్పారావులు పాల్గొన్నారు.

# విశాఖ డెయిరీ ఉచిత కంటి వైద్య శిబిరం



అచ్యుతాపురం : మండలంలో జగ్గన్నపేట పాల ఉత్పత్తిదారుల కేంద్రంలో బుధవారం విశాఖ డెయిరి అధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పైల వరలక్ష్మి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 90 మందికి వైద్య పరిక్షలు నిర్వహించి 20 మందికి కళ్ల అద్దాలు, 10 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డి రాజు, ఎస్ రమణ, వి సురేష్, కె శేఖర్, ఎస్ రాంబాబు,పి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# పాత నోట్లతో కొత్త బేరం



విశాఖ క్రైం: శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి విశాఖకు చేరుకుని స్థానికులకు పాతనోట్లు ఇచ్చి వాటిని చెలామణి చేస్తే 15 శాతం కమీషన్ ఇస్తామని దొంగనోట్ల ముఠా ఎరచూపారు. కమీషన్ డీల్ కుదరకుంటే అంతు చూస్తామని బెదిరింపులకు దిగారు. ఈ ముఠాలో 14 మంది సభ్యులున్నారు. పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో పోలీసు కమిషనర్ ఆర్.కె.. మీనా పై విషయాలను వెల్లడించారు. బుధవారం పీసీ ఆర్కే మీనా మాట్లాడుతూ ఒక కోటి 97 వేల విలువగల పాత నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముఠా సభ్యులు ఉపయోగించిన వాహనాన్ని, వాహనంపై పోలీసు లైట్‌ను, కంట్రీమేడ్ పిస్టల్‌ను, వాకీటాక్‌ను, ఆరు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలలోకి వెళ్లగా.. 2017లో కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన పాత నోట్లను రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు అంటగట్టి వాటిని చెలామణి చేస్తే 15 శాతం కమీషన్ ఇస్తామని చెప్పారు. లేదంటే జాగ్రత్త అని బెదిరించారు. విషయం తెలుసుకున్న పరవాడ పోలీసులు రంగ ప్రవేశం చేసి ఒక వ్యాపారి వద్ద నుంచి నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులు అతి చాకచక్యంగా పోలీసు అనే నెంబరు ప్లేటును కలిగిన ఒక వాహనాన్ని కూడా నడుపుతున్నట్లు గుర్తించారు. దీంతో ఆ వాహనాన్ని ఎవరూ ఆపడానికి ధైర్యం చేయడం లేదు. ఈ నేపథ్యంలో అగనంపూడి టోల్‌గేట్ వద్ద పోలీసులు వలపన్ని ఆ వాహనాన్ని అదుపులోనికి తీసుకున్నారు. ఉన్నతాధికారుల సహాయంతో కేసును ఛేదించారు.

ముఠా నుంచి బుల్లెట్లు, వాకీటాకీ, పాతనోట్లు, పోలీసు నెంబరు ప్లేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో డీసీపీ-2 ఉదయ్ భాస్కర్ ఆధ్వర్యంలో క్రైం ఏసీపీ శ్రావణ్ కుమార్, సీఐ రఘువీర్ విష్ణు, ఎస్ఐ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. దర్యాప్తు చేపట్టిన పోలీసు ఐటీ కోర్ టీం, హెడ్‌కానిస్టేబుల్‌ను సీపీ అభినందించారు. ముఠాకు ఈ నగదు ఎక్కడి నుంచి వచ్చింది? ఈ రంగం వెనుక ఎవరి హస్తముందో అనే విషయాలపై ఆరా తీయడం మొదలుపెడుతున్నారు.

# తుమ్మపాల రోడ్డును తక్షణమే మరమ్మతులు చేపట్టాలి



అనకాపల్లి : మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మ పాల ప్రధాన రహదారులను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని జై అనకాపల్లి సేన అధ్యక్షుడు కొణతాల సీతారాం డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి - చోడవరం - మాడుగుల - పాడేరు ప్రాంతాల కు వెళ్లాలంటే ప్రధాన రహదారి గా ఉన్న తుమ్మ పాల ప్రధాన రహదారి అత్యంత దారుణంగా ఉందని, రహదారి మధ్య లొ భారీ గోతులు ఏర్పడి ఉన్నాయని, ఈ గోతులు లో భారీ వాహనాలు ద్విచక్ర వాహనాలు వెళ్లడం వల్ల అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి అన్నారు. దీనికితోడు ఇదే రహదారిపై క్వారీ లారీ లు పరిమితి కి మించి లోడ్ ల తో వెళ్లడంతో గోతులు మరింత పెద్దవి గా మారి ప్రయాణికులకు ఇబ్బందులు గురి చేస్తున్న, అలాగే ఇప్పటికే చాలా మంది ముఖ్యంగా యుక్త వయస్సు లో ఉన్న యువకులు మ ృత్యువాత పడి వారి కుటుంబాలకు శోకాన్ని మిగిల్చిన వారి శో కా న్ని ప్రజా ప్రతినిధు లు, రోడ్డు భవనాల శాఖ మాత్రం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. గతంలో ఇదే పంచాయతీ లో రోడ్డు తీవ్రంగా దెబ్బ తిని ఉండగా ఆర్ అండ్ బి అధికారులు పట్టించు కోక పోవడం తో అధికారం లో లేక పోయినా తన సొంత ఖర్చుతో తో రహదారి కి తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని గుర్తుచేశారు. గోతులు ఏర్పడ్డా రహదారులు ను కాదని బాగున్న రింగ్ రోడ్డు పై మరలా కొత్త రోడ్డు లు వేయడం తగదన్నారు. ఆర్ అండ్ బీ శాఖ కు అధికార పార్టీ నాయకులకు రోడ్డు మరమ్మతులు చేపట్టడం చేతకాకపోతే అనకాపల్లి సేన రంగంలోకి దిగి మరమత్తులు చేపట్టడానికి సిద్ధమని ఆయన అన్నారు. తనకి అధికార ముక్యం కాదని పదవులు లేక పోయినా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఫ్లెక్సీ బోర్డులు కి ఇస్తున్న ప్రాధాన్యత స్థానిక సమస్యల పరిష్కారం కోసం చూపిన స్థానిక సమస్యల పరి ష్కారం కోసం చూపిస్తే బాగుం టుందని హితవు పలికారు.

తక్షణమే ఎమ్మెల్యే, ఎంపీలు రహదారి పరిస్థితులు పై సమీక్షా సమావేశం నిర్వహించి మరమ్మత్తులు చేపట్టాలని నాసిరకం రోడ్డు వేసిన కాంట్రాక్టర్లపై చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో జై అనకాపల్లి సేన పెద్ద ఎత్తున ఆందోళన చేపడ తామని సీతారాం హెచ్చరించారు.

# ట్రాఫిక్ ఉల్లంఘనులకు భారీ జరిమానా

దిల్లీ: తరచూ నగర, పట్టణ రహదారుల్లో సొంత వాహనాలపై ప్రయాణించే మధ్య తరగతి ప్రజలు ఇకపై మరింత అప్రమత్తంగా ప్రయాణించాల్సిన సమయం ఆసన్నమైంది. ఎందుకంటే రోడ్డు నిబంధనలు అతిక్రమించిన వారికి ట్రాఫిక్ పోలీసులు విధించే జరిమానాలు (చలాన్) ఇక మరింత ప్రియం కానున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు ఈ చలానాల బారి నుంచి తప్పించుకోవాలంటే ఇకపై కచ్చితంగా రోడ్డు నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. 1988 నాటి మోటారు వాహనాల చట్టానికి గత నెల పార్లమెంటులో సవరణలు చేసిన సంగతి తెలిసిందే. మోటారు వాహనాల (సవరణ) చట్టం-2019 ప్రకారం కొత్త జరిమానాలు వచ్చే నెల మొదటి తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. దీని ప్రకారం అత్యవసరర వాహనాలైన ఫైర్ ఇంజిన్, అంబులెన్స్ వంటి వాటికి దారి ఇవ్వకపోతే రూ.10 వేలు జరిమానా విధిస్తారు. ఇప్పటివరకూ రూ.100 జరిమానా ఉన్న ట్రాఫిక్ ఉల్లంఘనలకు రూ.500 చలానా విధించే వెసులుబాటు ఉంటుంది. అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తే రూ.2 వేలు, లైసెన్స్ ఇంటివద్ద మర్చిపోతే రూ.5 వేలు, వాహనం ఇన్సూరెన్స్ కాపీ లేకుండా ప్రయాణిస్తూ పట్టుబడితే రూ.2 వేలు పెనాల్టీలు విధించనున్నారు. రోడ్డుపై అనుమతించిన వేగం కన్నా ఓవర్ స్పీడ్‌తో ప్రయాణిస్తే రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు, సీట్‌బెల్టు లేకుండా ప్రయాణిస్తే రూ.వెయ్యి వరకూ జరిమానాలు విధిస్తారు. ఇక ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ శిరస్త్రాణం ధరించకపోతే రూ.వెయ్యి కట్టాల్సిందే.

# మంచినీటి సమస్య పరిష్కారం చెయ్యాలి...

## ఎస్.ఎఫ్.ఐ ఆద్వర్యంలో విధ్యార్థినుల ధర్నా



అరకులోయ : అరకు లోయ మండలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా హాస్టల్ లో సుమారు 300 మంది విధ్యార్థినిలు చదువుతున్నప్పటికి తమ కాలకృత్యాలు తీర్చుకోవడానికి కనీసం మంచినీరు కుడా లేదని,ఆరుబయటే వెళుతున్నారని,ఎస్.ఎఫ్.ఆద్వర్యంలో బుధవారం నాడు హాస్టల్ లో విధ్యార్థులు ధర్నా చేశారు.ఉన్న ఒకే ఒక్క విధ్యుత్ కొళాయి ఉంది,విద్యుత్ సప్లయి ఉన్నప్పుడు నీరు ఉంటుంది.విద్యుత్ సప్లయి లేనప్పుడు నీరు ఉండడం లేదు.విధ్యార్థినిలు స్నానం చెయ్యడానికి చాల ఇబ్బందిగా ఉందంటున్నారు.అలాగే వసతి గ ృహం చుట్టుపక్కల ప్రహారీ కుడా లేదు.రాత్రి సమయంలో ఏ సమయంలో ఏమీ జరుగుతోందని ఆందోళనలతో విధ్యార్థులు ఉంటున్నారు.ఈ డిగ్రీ మహిళా వసతి గ ృహంలో రాత్రి సమయంలో హాస్టల్ నిర్వహకులు వుండాలి,అలాగే వాచ్మెన్ ని నియమించాలని ఎస్.ఎఫ్.ఐ ఆద్వర్యంలో విధ్యార్థులు ధర్నా చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ మండల కార్యదర్శి ఎస్.బాబురావు,మండల అద్యక్షుడు పి.రామన్న ఎమ్.వంశీమోహన్,టి.అర్జున్ హాస్టల్ విధ్యార్థినిలు పాల్గోన్నారు.

# విజయ్ సాయి రెడ్డిని కలిసిన కొండా రాజీవ్ గాంధీ



విశాఖపట్నం: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి వేణుంబాక విజయసాయి రెడ్డిని ఆ పార్టీ విశాఖపట్నం యువజన విభాగం అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ బుధవారం ఢిల్లీలో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా త్వరలో జరగను న్నటువంటి గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జండా ఎగిరి తీరాలని ఆ దిశగా యువజన విభాగం మరింత ముమ్మరంగా పనిచేయాలని కొండా రాజీవ్ గాంధీకి విజయసాయి రెడ్డి గారు దశా దిశా నిర్దేశం చేశారు.

### ఈ నెల 23 నుంచి 25 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

విశాఖపట్నం: 23 నుంచి జిల్లా పరిషత్ శ్రీ కృష్ణ చైతన్య మఠం లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జిల్లా పరిషత్ ప్రధాన కూడలిలో వేంచేసి యున్న శ్రీకృష్ణ చైతన్య మఠం లో ఈ నెల 23 నుంచి 25 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని ఆ మఠం పీఠాధిపతి త్రిదండి బీఎస్ కేశవ్ మహరాజ్ తెలిపారు. 23వ తేదీ వేకువజాము నుంచి రాధాకృష్ణుల వారికి వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి, రాధావువిందుని కి ప్రత్యేక పూజలు, నామ గోత్రాలు తో ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నామన్నారు. హైదరాబాద్ కు చెందిన సురభి వారి మూడు రోజుల పాటు పౌరాణిక నాటకాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 23న మాయాబజార్, 24న కృష్ణ లీలలు, 25న భక్త ప్రహ్లాద , లక్ష్మీ నృసింహ కళ్యాణం నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ ఉత్సవాల్లో పూరి, బృందావనం నవదీపం, మాయాపురం, మధురాల నుంచి అనేక మంది సాధువు మహారాజులు, బ్రహ్మచారి సన్యాసులు హాజరై హరినామ సంకీర్తనలు, మేళతాల మంగళ వాయిద్యాలతో, అత్యంత వైభవంగా జరుగుతారని మహరాజ్ చెప్పారు.

# వర్సిటీతో అనుబంధం మరింత బలోపేతం కావాలి

## రక్షణ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి



విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో రక్షణ రంగాల అనుబంధం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి పి.హరి ప్రకాష్ అన్నారు. బుధవారం ఉదయం ఆయన ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరి ప్రకాష్ మాట్లాడుతూ రక్షణ రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు విద్యోన్నతి, నైపుణ్య అభివృద్ధికి ఏయూ అందిస్తున్న సహకారం నిరుపమానమన్నారు. భవిష్యత్తులో సైతం ఇదే విధమైన సహకారాన్ని రక్షణ రంగాల ఉద్యోగులకు అందించాలని కోరారు. మరిన్ని కోర్సులను మంజూరు చేస్తామని, వీటి నిర్వహణ బాధ్యతను ఏయూ స్వీకరించాలని ప్రతిపాదించారు. వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఏయూను గుర్తించి రక్షణ రంగాల ఉద్యోగులకు శిక్షణకు కేంద్రంగా ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. వర్సిటీలోని విలువైన మానవ వనరులను సద్వినియోగం చేస్తూ పూర్తిస్థాయిలో త్రివిధ దళాల సిబ్బందికి వారి ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పి.హరి ప్రకాష్‌ను వర్సిటీ తరపున సత్కరించారు. కార్యక్రమంలో ఏయూ రక్షణ రంగాల విద్యా సంబంధ కార్యక్రమాల సమన్వయకర్త ఉజ్వల్ కుమార్ ఘటక్ తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన



విశాఖపట్నం: ఉద్యోగుల పదవీ విరమణ వయసును తగ్గించే ప్రతిపాదనను నిరసిస్తూ భారతీయ టెలికాం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. విశాఖ బుల్లయ్య కళాశాల సమీపంలోని సీఆర్ఆర్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి డి.వి.ప్రసాద్, ఏపీ వైస్ ప్రెసిడెంట్ వీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగుల పదవీ విరమణ వయసును తగ్గించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ ప్రతిపాదనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతున్నామని వివరించారు. యువతకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం అన్ని ప్రభుత్వ రంగ విభాగాలను బలోపేతం చేయాలన్నారు. లేకపోతే యువత ఇతర దేశాలపై ఆధారపడవలసి వస్తుందన్నారు. అలాగే పలు సమస్యల పరిష్కారం నిమిత్తం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

లేనిచో భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిడి రాజ్‌కుమార్, వి.రామచంద్రరావు, పి.ఉమాశంకర్, సుబ్రమణ్యం, రమణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదావసాత్తూ భవననిర్మాణ కార్మికురాలు దుర్మరణం



గాజువాక: ప్రమాదవసాత్తూ నిర్మాణంలో ఉన్న భవనంనుంచి కాలుజారి ప్రక్కనున్న భవనంపై భవననిర్మాణ కార్మికురాలు పడడంతో తలకు తీవ్రగాయాలయ్యి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. బుధవారం దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి జీవీయంసీ 57వ వార్డు వడ్లపూడి గణేష్‌నగర్ సెక్టర్ 1లో నిర్మాణం జరుగుతున్న గ్రూపు హౌస్ వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం......గాజువాకహైస్కూల్ ప్రాంతం వద్ద నివాసం ఉంటున్న గురుపాటిలక్ష్మి(35) జోన్-5 వడ్లపూడి గణేష్‌నగర్ సెక్టార్ 1లో వియ్యపు శ్రీనివాసరావు భవనం నిర్మిస్తుండగా కూలిపనికోసం చేరింది. అయితే ఉదయం 9గం. భవననిర్మాణ కార్యక్రమంలో నిమగ్నమై ఉండగా ప్రమాదవసాత్తూ థర్డ్‌ఫ్లోర్‌నుంచి ప్రక్కనున్న మేడమీదకు జారిపడిపోవడంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న భవన యజమాని దువ్వాడ పోలీసులకు సమాచారం అందించగా సంఘటనవద్దకు చేరుకున్న పోలీసులు మృతిరాలిని పోస్టుమార్టం నిమిత్తం తరలించగా, మృతిరాలి బంధువుల అడ్డగించి నష్టపరిహారం చెల్లించాలంటూ డిమాండ్ చేసారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అయితే దువ్వాడ పోలీసులు జోక్యంతో పరిస్థితిని చక్కదిద్ది మృతిరాలని పోస్టుమార్ట నిమిత్తం తరలించి కేసునమోదు దర్యాప్తు చేస్తన్నట్లు పోలీసులు తెలిపారు.

# కంప్యూటర్ ఇంజనీరింగ్ తరహాలో బిబిఎ కోర్సు

## గీతం 'వర్సిటీలో అడ్మిషన్లు ప్రారంభం

సాగర్‌నగర్: దేశ వ్యాప్తంగా అత్యంత డిమాండ్‌ను సంతరించుకున్న కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ తరహాలో ఉద్యోగ అవకాశాలు తక్షణం లభించే విధంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఫిన్‌టెక్) కోర్సుకు రూపకల్పన చేసిందని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ ప్రొఫెసర్ వై.గౌతమ్ రావు తెలిపారు. మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, బ్యాంకింగ్ రంగాలలో కంప్యూటర్ టెక్నాలజీకి ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఫైనాన్స్ సబ్జెక్టులను టెక్నాలజీ సబ్జెక్టులను కలుపుతూ బిబిఎ (ఫిన్‌టెక్) కోర్సును ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనికి వివిధ పరిశ్రమల సూచనలు, సలహాలను సహితం పరిగణనలోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కోర్సులో ప్రవేశం పొందే విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థుల తరహాలో సైబర్ సెక్యూరిటి, ఆర్టిఫిషియన్ ఇంటెలిజెన్స్, పైథాన్ ప్రోగ్రామింగ్, బిజినెస్ ఎనలటిక్స్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఫిన్‌టెక్ పరిజ్ఞానం ఉన్న వారికి అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్న దృష్ట్యా ఈ కోర్సు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. పరిమితంగానే అడ్మిషన్లు నిర్వహించనున్న దృష్ట్యా ఇంటర్ మీడియట్ పూర్తి చేసిన వారికి ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌ను (9908036778) సంప్రదించాల్సిందిగా సూచించారు.

# వీసీ ప్రసాద రెడ్డిని అభినందించిన ఇగ్నో సంచాలకులు



విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని ఇగ్నో విశాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రాజారావు మర్యాద పూర్వకంగా కలిసారు. వీసీ కార్యాయంలో ఆచార్య ప్రసాద రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభకాంక్షలు తెలియజేశారు.

# బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు అశ్రద్ద చేయవద్దు



గాజువాక: బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు అశ్రద్ధ చేయకుండా విధ్యభ్యాసం కోసం పాఠశాలకు పంపించి వారి జీవితాన్ని బంగారుమయం చేయాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి పేర్కోన్నారు. బుధవారం జీవీయంసీ 50వ వార్డు భానోజీకాలనీ ఎంపిపిపాఠశాలలో విద్యార్థులకు వైకాపా నాయకులు దొడ్డిరమణ ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్సిల్లు, పెన్నులు, ఏకరూదుస్తులు, బూట్లు అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నాగిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఉత్తమవిద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని అన్నారు. ప్రతీ తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధవహించి, విలువలతోకూడిన విద్యను అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను అందించి పిల్లల భవిష్యత్‌కు బంగారుబాటలు వేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అమ్మబడి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తుంపాలతాతారావు, మద్దిశంకరెడ్డి, రెడ్డిజగన్నాధం, మద్దాల అప్పారావు, గునా, శ్రీను, సుజాత, మంజుల, పుష్ప, ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, స్వర్ణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రులకు ఎటువంటి కొరతా రానీయవద్దు

## జిల్లా కలెక్టరు వి.వినయచంద్



విశాఖపట్నం: జిల్లాలో గల ఆసుపత్రులలో మందులు, వైద్యపరికరాల విషయంలో ఎటువంటి కొరతలేకుండా చూడాలని ఆసుపత్రుల పర్యవేక్షకులను జిల్లాకలెక్టరు వి.వినయ్చంద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరు ఛాంబర్లో నిర్వహించిన ఆసుపత్రుల అభివృద్ధి కమిటీసమావేశంలో ఆయనమాట్లాడు తూవైద్య శాలలకు సంబంధించిన వివిధపద్దులలోవున్న నిధులను సక్రమంగా వినియోగించడంతో పాటుఅత్ యవసరాలైన వైద్య, మౌలిక వసతులకు ప్రాధాన్యతని వ్వాలన్నారు. నగరంలోగలరాణిచంద్రమణిదేవి

ఆసుపత్రి, విక్టోరియాఆసుపత్రి, ఛాతి ఆసుపత్రి,మానసికఆరోగ్యఆసుపత్రి,కంటి,ఈ.ఎన్.టి.జిల్ లాలోగల ప్రభుత్వ ఆసుపత్రులలో గలపరిస్థితులు, నిధులఖర్చుపై కలెక్టరు క్షుణ్ణంగాచర్చించారు. ప్రతి ఆసుపత్రిలో విద్యుత్తు, నీరు,మందులు నిత్యం వుండాలన్నారు. ఆసుపత్రి భవనాలు పటిష్టంగా వుండాలని, ఏమైనా మరమ్మత్తులు ఏర్పడితే వెంటనేస్పందిం చాలన్నారు. ఆసుపత్రి పరిసరాలనుశుభ్రంగావుంచాలని, పచ్చదనంతో వుండే లామొక్కలను పెంచాలన్నారు. నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లువుండ రాదన్నారు.

కమిటీకార్యని ర్వాహక అధ్యక్షులు ఆర్.రవికుమార్, ఛాతి ఆసుపత్రిపర్యవేక్షకులు డాక్టర్సాంబశివరావు,జిల్ లావైద్య ఆరోగ్యశాఖాధికారిడాక్టరు తిరుపతి రావు, జిల్లాఆసుపత్రులకోఆర్డినేటర్డాక్ట

ర్నాయక్, వివిధ ఆసుపత్రులకు చెందినపర్యవేక్షకులు, ఆర్.ఎమ్.ఓ.లుడాక్టర్విమకర్, డాక్టర్వి జయగౌరి, డాక్టర్జిరఘునాధబాబు, తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై బురద జల్లడం సమంజసమా ?



విశాఖపట్నం: జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో ఈ రోజు చిన్న గంట్యాడ 100 అడుగుల రోడ్డు వద్ద ఉన్న సిఐటి ఆఫీసు లో ప్రెస్ మీట్ జరిగింది. ఈ ప్రెస్ మీట్ కు ముఖ్యఅతిథిగా ఏపీ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ అధ్యక్షులు జి. సుబ్బారావు గారు హాజరై మాట్లాడుతూ. పారిశుద్ధ్య కార్మికులు 1,గంటా, రెండు గంటలు, మాత్రమే పని చేసి ఇళ్లకు వెళ్లి పోతున్నారు అని కార్మికులపై నిందలు మోపటం ఒక పత్రికలో కథనాలు వచ్చాయి దీనికి మేము జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గా ఖండిస్తున్నాం. నిజానికి జివిఎంసి 8 జోన్ లలో 5113 మంది కార్మికుల లా అనారోగ్యం, వృద్ధాప్యం, చనిపోయిన వంటి, ఇతర కారణాల వల్ల ఎనిమిది వందల మంది పని లో లేరు. జీవీఎంసీ విస్తరణ బట్టి ప్రభుత్వ లెక్కల ప్రకారం 2000 కార్మికులు కావాలి. ఈ మొత్తం భారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల శ్రమించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారు. స్వచ్ఛ సర్వే లో 500 నగరాల్లో మూడు,ఏ డు, ర్యాంకు సాధించాము అంటే అది పారిశుద్ధ్య కార్మికుల వల్లే అటువంటి వారిపై నిందలు వేయడం తగునా ? పత్రికలో వచ్చిన ప్రకారం అట్లా డ్యూటీలు ఎగ్గొట్టి ఇంటికి వెళ్ళి టము అంటే అధికారుల అండ దండ ఉంటేనే గానీ ఇది సాధ్యమా ? ఇలాంటి వార్తలు పూర్తి అవగాహన లే కొండ ప్రజలను పక్కదారి పట్టించి నట్లే అని అన్నారు. ఈ ప్రెస్ మీట్ లో కె.వి.రమణ, గణేషు రాము, నాగరాజు గొలగానీ అప్పారావు, సూరిబాబు,రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### మైనర్ డ్రైవర్లు!

కాలేజీ విద్యార్థులు బైకులు, కార్లపై మితిమీరిన వేగంతో దూసుకుపోవడం వల్ల జరుగుతున్న ప్రమాదాల పట్ల ఎంతోకాలంగా ఆందోళన చెందుతున్నాం. కానీ కాలేజీ విద్యార్థులే కాదు, మైనారిటీ తీరని పిల్లలు కూడా వాహనాలు నడుపుతూ ప్రమాదాలు సృష్టిస్తున్నారు. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం ఇద్దరి ప్రాణాలు బలిగొని అంతులేని విషాదాన్ని మిగిలించింది. పదో తరగతి చదువుతున్న పదహారేండ్ల బాలుడు స్నేహితులను ఎక్కించుకొని అతివేగంగా రాంగ్‌రూట్‌లో దూసుకుపోయి, ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను, మరో రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టాడు. ఆటోలో ఒక మహిళ తన తల్లి, ఇద్దరు కవల పిల్లలతోపాటు ప్రయాణిస్తున్నది. కారు ఢీకొనడంతో ఆ మహిళ గాయాలపాలై విషమ పరిస్థితిలో ఉండగా ఆమె తల్లి ప్రాణాలు కోల్పోయింది.14 నెలల వయసున్న ఇద్దరు కవల పిల్లల్లో ఒక బాలుడు మరణించాడు. ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు కూడా గాయాలు కాగా, వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇలా నగరంలో రోజూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతి నెల 25 నుంచి 30 మంది దాకా దుర్మరణం పాలవుతున్నారు. ఈ ఏడాది అక్టోబర్ వరకే నగరంలో 250 మంది రోడ్డుప్రమాదాల్లో చనిపోయారు. రోడ్డు ప్రమాదాలకు అనేకానేక కారణాలుంటే, అందులో కొన్ని ప్రమాదాలకు మైనర్లు కారణం కావటం తీవ్ర విషయం. ఈ ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 40 శాతం వాటికి మైనర్లే కారకులని తేలింది. 2017లో 1761 ప్రమాదాలకు మైనర్లు కారణమైతే, 2018లో 1931, 2019లో ఇప్పటిదాకా 2832 ప్రమాదాలకు మైనర్లే కారకులు కావటం గమనార్హం. తల్లిదండ్రుల అతి గారాబం, పిల్లల నిర్లక్ష్యం ఇతరుల ప్రాణాలు తోడేసిదిగా మారటమే పెద్ద విషాదం. ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో మన దేశమే అగ్రస్థానంలో ఉన్నది. దీనికి అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడుపటం, ట్రాఫి క్ నిబంధనలు పాటించటంలో అలసత్వం, వాటిపై అవగాహన లోపం ప్రధాన కారణాలని తెలుస్తున్నది. రహదారులను శాస్త్రీయపద్ధతిలో నిర్మించకపోవటం, జాతీయ రహదారుల్లో కూడా అతి దగ్గరి మూల మలుపులు ఉండటం కూడా ప్రమాదాలకు హేతువులుగా ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. 2017లో దేశ వ్యాప్తంగా 4,61,000 ప్రమాదాలు జరుగగా లక్షా 49 వేల మంది దుర్మరణం పాలయ్యారు. గతేడాది 4,65,000 ప్రమాదాలు జరుగగా లక్షా 48 వేల మంది చనిపోయారు. ఈ మధ్య కాలంలో ద్విచక్రవాహనాల ప్రమాదాలు పెరిగిపోయి యువత మరణాలు లెక్కకు మిక్కిలి జరుగుతున్నాయి. దీనికి అతివేగం, మద్యం తాగి నడుపటమే ప్రధాన కారణమని తేలింది. ఇలా రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారిలో ఎక్కువగా 16 నుంచి 30 ఏండ్ల లోపు వారే ఉంటున్నారు. ఈ ప్రమాదాలను అరికట్టేందుకే ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో మోటారు వాహనాల చట్టం (సవరణ) బిల్లును ఆమోదించారు. ఈ చట్టంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించటం, మద్యం తాగి వాహనాలు నడుపటం వంటి నేరాలకు జరిమానాలు పెంచటమే కాదు, తీవ్ర నేర విషయం గా పరిగణించి శిక్షా కాలాన్ని కూడా పెంచారు. మైనర్లు, లైసెన్స్ లేకుండా నడిపిన వారికి జరిమానాతో పాటు శిక్ష వేసేవిధంగా చట్టాలకు పదునుపెట్టారు. మైనర్లకు వాహనాలు అందకుండా చూడటం తల్లిదండ్రుల బాధ్యత. కొందరు తల్లిదండ్రులే పిల్లలకు పనులు చెబుతూ వాహనాలు తీసుకుపొమ్మని పురమాయిస్తున్నారు. ఇదే అలవాటుగా పిల్లలు తల్లిదండ్రులు ఇంట్లో ఉన్నా లేకున్నా వాహనాలు తీసుకుని మిత్రులతో పాటు తిరుగుతున్నారు. వీరికి రోడ్డు నిబంధనలు తెలువవు. వాహనాన్ని నడిపేంత పరిణతి ఉండదు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపడం నేరమనే స్పృహ కూడా ఉండటం లేదు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన పిల్లలను తల్లిదండ్రులు వెనుకేసుకురావడం సాధారణం. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులకు తెలువకుండా పిల్లలు వాహనాలను నడుపవచ్చు. తమ వాహనాలను పిల్లలకు అందకుండా జాగ్రత్తపడవలసిన బాధ్యత తల్లిదండ్రులదే. అందుకే పోలీసులు మైనర్లతోపాటు వాహన యజమానులైన పెద్దలపైనా కేసులు నమోదు చేస్తున్నారు. కొందరు సంపన్నులు జరిమానా విధింపులకు భయపడటం లేదు. జరిమానాలు స్వల్పంగా ఉన్నందున వాటిని చెల్లిస్తూ అదే తప్పు మళ్ళా చేస్తున్నారు. అందువల్ల రెండవసారి నేరం చేసిన వారికి కఠినశిక్షలు వేయాలని పోలీసులు అంటున్నారు. జరిమానాను కూడా భారీగా వడ్డించినప్పుడే తల్లిదండ్రులు జాగ్రత్తపడుతారని వారు సూచిస్తున్నారు. ఈ క్రమంలో మన రాష్ట్రంలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ పోలీసులు విప్లవాత్మక మార్పులతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించటంతో పాటు ప్రమాదాల నివారణకు పెద్దపీట వేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై దృష్టిసారించి వాహనదారులకు జరిమానాలు, శిక్షలు విధిస్తున్నారు.

## మత్స్యకార వృత్తి విద్యను ఏయూలో ప్రవేశపెట్టండి

### ఏయూ వీసీని కలిసిన జానకిరామ్



ఆంధ్రాయూనివర్సిటీ : ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ప్రసాద్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ మత్స్యకార యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు, యాదవులు మరియు మిగతా బీసీ కులాలకు సంబంధించినటువంటి వృత్తి విద్యా కోర్సులను ఆంధ్ర యూనివర్సిటీలో ప్రవేశపెట్టినట్లు అయితే వాటి ద్వారా విద్యార్థులందరూ ఉత్తీర్ణులై ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొంది అభివృద్ధి చెందుతారని, నిరుద్యోగ సమస్య కూడా చాలావరకు నిరోధించడానికి అవకాశం ఉంటుంది కనుక ఈ విధంగా ఆలోచించి కార్యాచరణ చేయాలని చెప్పి ఈ సందర్భంగా వీసీ గారి జానకిరామ్ కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన రాష్ట్ర అధికార ప్రతినిధి తుళ్ళు చంద్రశేఖర్ యాదవ్ మరియు మత్స్యకార నాయకులు సురపతి నర్సింగ్ బడే ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

## సర్క్యూట్ కార్యాలయంలో ప్రాజెక్టు పనులపై చర్చ



భీమునిపట్నం : రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం విశాఖ సర్క్యూటే ఆఫీసులో విఎంఆర్‌డిఎ కమిషనర్స్ మరియు ప్రాజెక్ట్ పనులకు సంబంధించి అధికారులతో కలిసి ప్రాజెక్ట్ పనుల గురించి చర్చించటం జరిగింది. ఈ సందర్భంలో మంత్రివర్యులు అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలేశ్వరం నుంచి నేరుగా విశాఖకు సుమారు రూ.2 వేల కోట్లతో చేపట్టనున్న పైప్ లైన్ ప్రాజెక్ట్ తోనే విశాఖ ప్రజల దాహం తీరుతుందని అన్నారు. ఈ ప్రాజెక్ట్ గురించి గతంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ద ృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు అని చెప్పారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నుంచి వచ్చే నీటిని ఏలేశ్వరం రిజర్వాయర్ కు, అక్కడ నుంచి నేరుగా విశాఖ మహానగరానికి వస్తే మంచి నీటి సమస్య పూర్తిగా తొలగి పోతుందన్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్ల వ్యయం కానుండడంతో రూ.1200 కోట్లు పలు పరిశ్రమల యాజమాన్యాలు భరించటానికి ముందుకు వచ్చాయని చెప్పారు. మిగిలిన రూ.800 కోట్ల భారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వంపై పడకుండ పలు ఫండింగ్ ఏజెన్సీలను ఆహ్వానించి, తద్వారా పైప్ లైన్ పనులు వేగవంతం చేస్తే భారం తగ్గుతుందని మంత్రి వర్యులు అవంతి శ్రీనివాస రావు చెప్పారు.

## శాఖా గ్రంధాలయంకు స్థలం కేటాయించాలి



అనకాపల్లి : పట్టణంలో ఉన్న ప్రభుత్వ శాఖా గ్రంధాలయానికి శాశ్వత నూతన భవనం నిర్మించాలని సిద్దార్ధ సోషల్ సర్వీస్ & కల్చరల్ అసోషియేషన్ వ్యవస్థాపకులు బల్లా నాగభూషణం విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతికి అసోషియేషన్‌తో పాటు పలువురు వినతిపత్రం అందజేశారు. అద్దె భవనంలో గ్రంధాలయం నడుస్తుందన్నారు. అనకాపల్లిలో శాఖా గ్రంధాలయానికి సొంత భవనం లేకపోవడం అన్యాయమన్నారు. గత కొద్ది రోజులుగా సొంత భవనం నిర్మించాలని అనేక మందిని కోరడం జరిగిందన్నారు. ఎన్నో దపాలు ర్యాలీలు నిరసనలు వినతులు చేసామన్నారు. అయినప్పటికీ పాలకులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం గ్రంధాలయ భవనాన్ని నిర్మించాలని అందుకు చొరవ తీసుకోవాలని, డాక్టర్ సత్యవతిని కోరారు. ముందుగా పార్లమెంట్ సభ్యురాలు దంపతులను సత్కరించారు. సొంత భవనం ఏర్పాటుపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షీలా మాణీలు, ఉజ్జి సత్యనారాయణ, రొబ్బి మల్లేశ్వరరావు, అల్లాడ శ్రీనివాసరావు, కె. సాయాదేవి, జి. దేవి, సుగుణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## సమకవియం

### ఆడపిల్ల

ఆడపిల్ల పుట్టినప్పుడే 'మైనస్' అన్న పెదవి విరుపులు
ఇవి ఏమీ తెలియని పసిపాప బోసినవ్వులు
యుక్త వయసు రాగానే మగపిల్లల మధ్యకెళ్ళొద్దని
తల్లి చీవాట్లు
చదివింది చాలులే ఆడపిల్లకు చదువెందుకని
తండ్రి అరుపులు
ఉద్యోగం చేసే ఆడవారి పట్ల
తోటివారి ఆకలిచూపులు
మగమహారాయుడిలా ఉద్యోగం చేస్తుందని
చుట్టుపక్కల వాళ్ళ సూటిపోటు మాటలు
అన్ని రంగాల్లో మగవాళ్ళతో
సమానంగా వున్నా
ఆడవాళ్ళకు తప్పలేదు ఈ బాధలు

...కవితా రచన
వైదా ఈశ్వరరావు
సెల్ నెం:7674942843

## పంచాంగం

మాసం : శ్రావణ ; తిథి : సప్తమి తె.3.11; భరణి రా.11.12; ఉ.వ.7.59ల 9.40.

గురువారం 22-08-2019

a **మేషం** : మీ సంతానం ఉన్నతి కోసం కొత్తకొత్త పథకాలు రూపొందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు.బంధువులను కలుసుకుంటారు. స్త్రీలకు షాపింగ్‌లోనూ, వాహనం నడుపుతున్న పుడు ఏకాగ్రత ముఖ్యం. రావలసిన ధనం వసూలు విషయంలో శ్రమాధి క్యత, ప్రయాస లెదుర్కొంటారు. నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి.

b **వృషభం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కోవలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు కలిసివస్తాయి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి.

c **మిథునం** : స్త్రీలకు, గృహ వాతావరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళాకారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు.

d **కర్కాటకం** :విదేశీ వస్తువుల పట్ల ఆకర్షితులవుతారు. ప్రముఖులను కలుసుకుంటారు. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి.

e **సింహం** : పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. నిరుద్యోగులకు సదావకాశాలు లభించిన సద్వినియోగం చేసుకోలేరు. ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది.

f **కన్య** : కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తలపెట్టేందుకు యత్నిస్తారు. చిన్ననాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్తిని కొనుగోలుచేయు యత్నాలు ఫలిస్తాయి. పనులు మొదట్లో మందగించినా క్రమేపీ పూర్తికాగలవు. కుటుంబీకులతో దైవ దర్శనాలు చేసుకోగలగుతారు.

g **తుల** : కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది.

h **వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఆటంకాలు క్రమంగా తొలగిపోగలవు. ఒక్కోసారి మీ జీవిత భాగస్వామి మనస్తత్వం అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. సభలు, సమా వేశాలల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు.

i **ధనుస్సు** : ఫ్యాన్సీ, స్టేషనరీ, రసాయన, సుగంధ ద్రవ్య వ్యాపారులకు శుభదాయకం. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. ఆకస్మిక ఫీజులు, బిల్లులు చెల్లిస్తారు. పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. సోదరీ, సోదరులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబీకుల ఆరోగ్యంలో మెళకువ అవసరం.

j **మకరం** : ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా సాగుతాయి. మీ సంతానం మొండివైఖరి వల్ల చికాకులు వంటివి ఎదుర్కొంటారు. ఫైనాన్స్ వ్యాపారస్తులకు ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులకు తాత్కాలిక అవకాశం లభిస్తుంది. పెద్దలతో కుటుంబ విషయాలు చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు.

k **కుంభం** :కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షల్లో ఏకాగ్రత ముఖ్యం. కుటుంబ విషయాల్లో స్త్రీలకు పట్టుదల, పంతాలు మంచిది కాదు. ఉద్యో గస్తులకు హోదాతో పాటు బరువు బాధ్యతలు పెరుగుతాయి. ఉపాధ్యాయు లకు పనిభారం అధిక మవుతుంది.

L **మీనం** : గృహంలో మార్పులు, చేర్పులు అనుకూలమైన కాలం. బ్యాంకు డిపాజిట్లు, దీర్ఘ కాలిక పెట్టుబడులకు అనుకూలం. పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

## షిర్డీ 'సాయిబాబా' జీవిత చరిత్ర

### సంకీర్తన



( గత తరువాయి)

పట్టి ఓడిపోయిన తరువాత బాబాలో చాలా మార్పు వచ్చింది. సూఫీ ఫకీరులలాగా మోకాళ్ళ వరకు ఉండే 'కఫనీ', తలకు టోపీలాగా చుట్టిన గుడ్డ ధరించడం మొదలుపెట్టారు. ఇలా ముస్లిం ఫకీరులా ఉండే బాబాకు స్థానిక హిందువులనుండి కొద్దిపాటి ప్రతిఘటన కూడా ఎదురయ్యింది.

1918లో తన మరణం వరకు సాయిబాబా షిరిడీలోనే ఉన్నారు. ఒక పాత మసీదును తన నివాసం చేసుకొన్నారు. యాచన అతని వృత్తి. మసీదులో ధునిని వెలిగించారు. అందులోనుండి విభూతిని తీసి తన దర్శనానికి వచ్చేవారికి పంచేవారు. అది తమకు రక్షణ ఇస్తుందని భక్తులు నమ్మేవారు. వచ్చిన వారికి ఉపదేశాలు, ధర్మ బోధలు చేసేవారు. చాలా మహత్తులు చూపించే వారని భక్తులు చెబుతారు. స్వయంగా వండి ప్రసాదాన్ని పంచేవారు. ఉత్సవాలలో పాల్గొనేవారు. ఒకోమారు విపరీతంగా కోపం చూపేవారు.

1910 తరువాత సాయిబాబా పేరు దేశమంతటా తెలిసింది. గొప్ప మహత్తులు చూపే సాదువనీ, లేదా అవతారమని విశ్వసించే భక్తులు పెక్కురు బాబా దర్శనానికి రాసాగారు.16 అక్టోబరు 15, 1918 మధ్యాహ్నం 2.30కి బాబా తన భక్తుని వడిలో మహా సమాధి చెందారు. ఆయన దేహం బూటెవాడలో ఖననం చేయబడింది. అక్కడే 'సమాధి మందిరం' నిర్మించబడింది.

**ముఖ్యమైన శిష్యులు**

సాయిబాబా తన మార్గానికి, ఉపదేశాలకు చెందిన సంస్థాగత ఏర్పాట్లు ఏవీ చెయ్యలేదు. ప్రత్యేకించి తన శిష్యులు అని చెప్పుకొనే వ్యవస్థ కూడా ఏమీ లేదు. ఆయన అందరికీ చెందినవారు. సకోరీకి చెందిన ఉపాసనీ మహారాజ్, అహమ్మద్ నగర్‌కు చెందిన మెహర్ బాబా వంటి సాయిబాబా భక్తులు ప్రసిద్ధులయ్యారు.

శ్రీ సాయిబాబా జీవిత సమయంలో కొందరు భక్తులు ఆయనను సదా అంటిపెట్టుకొని ఉన్నారు **వారిలో ముఖ్యులు:** మహాల్సాపతి, హేమాండ్ పంతు, శ్యామా ,తాత్యా.

**బోధనలు**

మసీదు గొడకానుకొని ఉన్న సాయిబాబా, భక్తులతోడుగా తన దైనిక వ్యవహారాలలోను, బోధనలలోను సాయిబాబా హిందూమతానికి చెందిన సంప్రదాయాలనూ, ఇస్లాం సంప్రదాయాలనూ కూడా పాటించారు. నమాజ్ చదవడం, అల్-ఫతీహా మననం, ఖొరాన్ అధ్యయనం వంటి ఆచారాలను ప్రోత్సహించారు కాని చాలా ఇతర ఆచారాలను పాటించలేదు. ఆయన దుస్తులు కూడా సూఫీ ఫకీర్ తరహాలోనే ఉండేవి. మతం, కులం వంటి భేదాలపై ఆధారపడిన విద్వేషాలను పూర్తిగా వ్యతిరేకించారు. అలాగే సనాతన ఛాందస సంప్రదాయాలను, ఏ మతానివైనా గాని, ఖండించారు. తాను ఫకీరుగా ఉన్నా తన అనుయాయులను సామాన్య గృహస్థ జీవనం గడపమని చెప్పారు. ప్రార్థన, భగవన్నామస్మరణ, పుణ్యగ్రంథ పఠనం-వీటిని ప్రోత్సహించారు. ఖొరాన్ చదువమని ముస్లిములకూ, రామాయణం, భగవద్గీత, విష్ణు సహస్రనామ స్తోత్రం వంటివి పారాయణం చేయమని హిందువులకూ ఉపదేశించారు. నీతి బద్ధమైన జీవనం గడపమనీ, ఇతరులను ప్రేమించి సహాయం చేయమనీ చెప్పారు. తన భక్తులకు రెండు ముఖ్యమైన లక్షణాలు అలవరచుకోమని పదేపదే చెప్పారు - అవి శ్రద్ధ (విశ్వాసం, భక్తి, దీక్ష), సబూరి (ఓర్పు, సాధన). నాస్తికత్వాన్ని తప్పు పట్టారు. అశ్రద్ధ చేయకుండా బాధ్యతలు నెరవేర్చాలనీ, వ్యామోహానికి లొంగకుండా తృప్తులు కావాలనీ ఉపదేశించారు. రెండు మతాల గ్రంధాలనూ సాయిబాబా ఆదరించి వ్యాఖ్యానించారు. వాటిపై ఆయనకు లోతైన పరిజ్ఞానం ఉందని ఆయనతో ఉన్నవారు చెప్పారు. హిందూ మత విషయాలపై బాబా వ్యాఖ్యానాలలో అద్వైతం, భక్తి అంశాలు కలగలిసి ఉండేవి. తన నివాస స్థానమైన మసీదుకు ద్వారకామాయి అని పేరు పెట్టుకున్నారు. భగవంతుడు అంతటా, అందరిలోనూ ఉన్నాడ నేది బాబా బోధనలలో ఒక ముఖ్యాంశం. సాయిబాబా ఉపదేశాలు ఇస్లామిక్ సిద్ధాంతాలకూ, ఉపనిషత్సూత్రాలకూ కూడా సరిపోతాయి. ఈ లోకం నశ్వరమనీ, భగవంతుడిచ్చే మోక్షమే శాశ్వతమనీ చెప్పారు. సాధనలో గురువు ప్రాముఖ్య తను గురించీ, గురువునే దేవుడిగా భావించమనీ పదేపదే చెప్పారు. పూర్వపు కర్మల కారణంగా వివిధ ఫలితాలు సంభవిస్తాయని కూడా చెప్పారు. సాయిబాబా రచించిన గ్రంధాలేవీ లేవు. సాయిబాబా బోధనలు మౌఖికంగానే శిష్యులకు లభించాయి. అవి పెద్ద పెద్ద ఉపన్యాసాలు కావు. సమయానుసారంగా చేసిన చిన్న చిన్న ఉపదేశాలు. తన వద్దకు దర్శనానికి వచ్చిన వారిని తరచు సాయిబాబా దక్షిణ అడుగుతుండేవాడు. అలా వచ్చిన ధనాన్ని పేదలకు పంచిపెట్టేవారు. మిగిలిన కొద్దిపాటి ధనంతో పుగాకు, -- **సశేషం** --

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

ASTROLOGY
శ్రీ శ్రీ కాణిపాకం స్వామి జ్యోతిష్యా/వాస్తు సమస్యలకు 25 సం॥లుగా సరైన పరిష్కారములు సూచిస్తున్నారు. అవసరమైన వారు పర్సనల్ అపాయింట్‌మెంట్ కొరకు ఈ ఫోన్ నెంబర్‌ను సంప్రదించవలెను.
9393110416

FINANCE
JK అసోసియేషన్ సర్వీసెస్
Govt. Reg. No. 136/2009
(with A/c Pay)
96665 47338

# అంభేరుపురంలో నేడు శంకాలమ్మ పండుగ


అంభేరుపురంలోని శంకాలమ్మవారు

చోడవరం : మండలంలోని అంభేరుపురం గ్రామంలో నేడు (గురువారం) శంకాలమ్మ పండుగ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవం సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు, సాయంత్రం ఊరే గింపులో పలు సాంస్కృతిక కార్య క్రమాలు, రాత్రి వినోద కార్య క్రమాలు ఉంటాయని తెలిపారు. ఉత్సవానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి పాల్గొననున్నట్లు వారు తెలిపారు.

# వెలవెలబోయిన వారపు సంతలు


వెలవెలబోతున్న కాశీపట్నం వారపు సంత

అనంతగిరి : అనంతగిరి మండలంలో గల దముకు కాశీపట్నం వారపు సంతలు వెలవెల బోయాయి. మణ్యెములో గత కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్న సంగతి తెలిసిందే గెడ్డలు ఎక్కువగా రావడం వలన ఇప్పటికే పలు గిరిజన గ్రామాలకు బయటి ప్రపంచంతో రాక పోకలు తెగిపోయే ఈ నేపథ్యంలో బుధవారం వారపు సంతలన్నీ కళావిహీనంగా తయార య్యాయి. ఉదయం 10 గంటలకు ఆరంభమైన సంతలో రెండు గంటలు సమయంలోగా ముగిసిపోతున్నాయి.

వారపు సంతలపై ఆధారపడి దుకాణాలు నిర్వహించే వారంతా కొనుగోలుదారులు లేక పోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు అదేవిధముగా మారుమూల గ్రామాల నుంచి అటవీ ఉత్పత్తు లను తీసుకొనివచ్చి విక్ర యించే రైతులు ఎవరు రాలేదు అని వ్యాపా రస్తులు వాపోయారు వెలవెలబోయాయి.

# పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దాపురం: రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రిలయన్స్ ఫౌండేషన్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బర్రే నాగేశ్వరరావు కోరారు. మంగళవారం మర్లావ గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశు వులకు గాలి కుంటువ్యాధి టీకాలు వేస్తే, పాడి రైతులకు మందులు, మినరల్ ప్యాకెట్లు ఉచి తంగా అందజేశారు.150 పశువులకు వైద్య పరీ క్షలు చేశారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం సపోర్టర్ బచ్చల శ్రీను, డా.నయీం, కాశిరాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

# ఐద్వా సంఘం ఆధ్వర్యంలో గిరిజన మహిళ సంఘం మండల కమిటీ ఎన్నిక



అనంతగిరి : గిరిజన సంఘం కార్యాల యంలో బుధవారం గిరిజన మహిళ సంఘం మండల కమిటీ ఎన్నిక జరిగింది ఈ కార్య క్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి ప్రభావతి మాట్లాడుతూ ఆడపిల్లకు విద్యా ఉద్యమం అందుబాటులో లేకుండా సమానత్వం అసాధ్యం అని చెప్పారు మహిళలకు సామాజికంగా ఆర్థి కంగా రాజకీయంగా మగవారితో పాటు సమాన ఆవకాశలు కల్పించినపుడే అణచివేతలు అంతమ వు తాయని చెప్పారు కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళాల పై అత్యాచారం పెరిగిందని ఉ. ఉన్నవ్ గట్టనాలు చూశమ్ రాష్ట్రంలో మద్యాన్ని దశలవారిగా నియంత్రణ చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంటున్నారు.

కానీ బెల్టుషాపులు విశలవీడిగా ఉన్నాయని తెలిపారు అనంతరం నూతన కమిటీని ఎన్ను కున్నారు. ప్రెసిడెంట్‌గా బి.కాసులమ్మ కార్య దర్శిగా కిల్లో మహాదేవి ఉపాధ్యక్షులుగా స్వాబి కాసులమ్మ నందుల సుమిత్ర దీసరి శ్రావణి ఐద్వా జిల్లా జాయింట్ సెక్రటరీ జయ శశికల తదితరులు పాల్గొన్నారు.

# ప్రదాన మంత్రి కిసాన్ మన్‌దన్ యోజన పెన్షన్ పథకంలో రైతులు చేరాలి

భీమునిపట్నం : ప్రదాన మంత్రి కిసాన్ మన్ దన్ యోజన పెన్షన్ పథకం లో రైతులు చేరా లని భీమిలి మండల అదికారిణి సి.హెచ్.సంధ్యా రత్నప్రభ తెలిపారు.

ఈ పథకం లో 18 నుండి 40 సంవత్సరాల లోపు చిన్న సన్నకారు రైతులు అనగా ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులు అర్హులు అని తెలిపారు.వయస్సు బట్టి రైతులు నెలకు 55 నుంచి 200 రూపా యలు వరకూ తమ వాటా క్రింద చెల్లించాలి మరియు అంటే డబ్బు ప్రభుత్వం కూడా కడుతుందని. ఈ విదంగా ప్రీమియం కట్టుకుంటూ పొతే రైతుకి 60 సంవత్సరాల నుండి ప్రతీ నెల మూడు వేలు పెన్షన్ గా పొందవచ్చని ఒకవేళ పెన్షన్ ను పొందే రైతు మరణిస్తే అతని బార్య లేదా నామిని కి పదిహేను వందలు పెన్షన్ వస్తాదని ఈ పథకంలో చేరాలనుకొనే రైతులు ఆదార్‌కార్డ్, భూమి వివరాలు, బ్యాంకు అక్కౌంట్ బుక్ తో మీ సేవ సెంటర్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

# వర్సిటీ నిర్మాణాలపై నివేదిక సమర్పించిన నిపుణుల కమిటీ



## నిర్మాణ పనుల పర్యవేక్షణకు విజిలెన్స్ కమిటీ ఏర్పాటు
## వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి

విశాఖపట్నం: వర్సిటీలో జరుగుతున్న భవన నిర్మాణాల నాణ్యత, టెండర్లపై అధ్యయనం చేయడానికి నియమించిన ముగ్గురు సభ్యులు కమిటి బుధవారం సాయంత్రం తమ నివేదికను వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డికి అందజేశారు. కమిటి సభ్యులు ఇరిగేషన్ విభాగం విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఎం.టి.రాజు, రోడ్లు భవనాల శాఖ విశ్రాంత ఎస్ఇ వానపల్లి హనుమంత రావు, ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు జి.వి.ఆర్ శ్రీనివాసరావులు వర్సిటీ వీసీతో సమావేశమై నివేదికను అందించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి కమిటీ సభ్యులతో మాట్లాడుతూ భవిష్యత్తులో వర్సిటీలో జరిగే నిర్మాణ పనులపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ, పరిశీలన ఉంచే విధంగా ప్రత్యేక వ్యవస్థను, విధానాన్ని రూపొందించి,అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆంధ్రవిశ్వ విద్యాలయంతో జరిగే నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలలో నాణ్యత, జవాబుదారీతరం పెంచే విధంగా నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేకంగా విజిలెన్స్ కమిటీని నియమించనున్నట్లు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తెలిపారు.

నివేదికలో భాగంగా ప్రధానంగా విద్యుతీకరణ(ఎలక్ట్రికల్)కు సంబంధించిన పనుల్లో 7.5 శాతానికి జరగాల్సిన పనులు 12.5 శాతం అధిక ధరలకు పనులు నిర్వహించినట్లు కమిటి సభ్యులు గుర్తించారు. నాన్ ఎస్ఎస్ఆర్ విభాగంలో ఒకే విధమైన ధరలు వర్తింపచేయకుండా ఇంజనీర్లు ఒక్కోవిధంగా ధరలను అనుసరించడం జరుగుతున్నట్లు కమిటి గుర్తించింది.

ఇప్పటి వరకు జరిగిన పనులపై నాణ్యత అంచనా ప్రక్రియ సక్రమంగా జరగలేదని కమిటి స్పష్టం చేసింది. వ్యవస్థను బలోపేతం చేస్తూ నాణ్యత ప్రమాణాలు పరిశీలిస్తూ, పెంపుదల చేయడానికి పలు సూచనలు కమిటి సూచించింది.

రూసా పథకంలో భాగంగా జరుగుతున్న పనులను ఏపి ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపిఇడబల్యూఐడిసి) కు అప్పగించారు.

# ఎస్ఆర్ పురం ప్రియదర్శిని పాఠశాలలో క్రికెటర్ యూసఫ్ పఠాన్‌జి



సింహాచలం : విశాఖ పెందుర్తి మండలం సౌభాగ్యరాయపురం లో గల ప్రియదర్శిని డఫ్ అండ్ డంబ్ రెసిడెన్షియల్ స్కూల్ లో విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమమంలో పాల్గొన్న భారత క్రికెటర్ యూసఫ్ పఠాన్ విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు బదులుగా సమాదానాలు ఇస్తూ వారి జీవితంలో ఎదుగుదలకు ప్రేరణగా తన జీవితంలో ఒడిదుడుకులను ఎదుర్కుంటూ ఏ విధంగా క్రికెటర్ గా ఎదిగారో వివరిస్తూ విద్యార్థులలో ఆత్మ స్థైర్యాన్ని నింపి వారిని ప్రేరేపించారు. అనంతరం ఆటలలో రాణించిన విద్యార్థిని విద్యారు ్థలకు అభినందించి అనంతరం విద్యార్థులతో సెల్ఫీ లు దిగారు.



# ఇసుక దందా చేస్తున్న జగన్ ప్రభుత్వం



అనకాపల్లి : తెలుగుదేశం ప్రభుత్వం హయంలో ఇసుక ఉచితంగా ఇచ్చామని, జగన్ ప్రభుత్వం మాత్రం ఇసుక దందా చేస్తుందని, ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. జగన్ ప్రబుత్వం వచ్చిన వెంటనే ఉచిత ఇసుకను రద్దు చేసిందని దీనివలన జిల్లా వ్యాప్తంగా భవన కార్మికులకు, గృహ నిర్మాణం చేసుకునే మద్యతరగతి కుటుంబాలు ఇళ్లు నిర్మాణాలు ఆగిపోయాయని, భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఒక క్యూబిక్ మీటర్ ఇసుక 4500 రూపాయలు ధర నిర్ణయించి, దోపీడికి దిగిందని, ఇవి ప్రజలపై కక్ష సాదింపు చేసే చర్యగా కనబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డాక్టర్ నారాయణరావు, కొణతాల వెంకటరావు, బోడి వెంకటరావు, కోట్ని రామకృష్ణ, జగన్, బొలిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకటన

ది.02-07-2019వ తేదీన మధ్యాహ్నం 1.30 నుండి 2.30 ని॥ల మధ్య నేను యానాం దరియాలతిప్ప గ్రామము నుండి, యానాం ఫైర్‌స్టేషన్ ఎదురుగా గల టీ టైమ్ షాపుకు వచ్చే దారి మధ్యలో నాకు గల నలుపురంగు బ్యాగు మరియు అందలి మా కంపెనీ అయిన **PVR Vehicle Finance** కు సంబంధించిన 28 పూరింపబడ్డ రశీదులు (9451 నుండి 9478) మరియు 22 పూరించనటువంటి ఖాళీ రశీదులు (9479 నుండి 9500) గల యాభై రశీదులు గల రశీదు పుస్తకంతో సహా ఉన్న బ్యాగు పడిపోయినది. ఎవరికైననూ సదరు బ్యాగు సదరు రశీదు పుస్తకం దొరికిన యెడల నాకు ఈ క్రింది చిరునామాకు పంపించగలరు. నా మొబైల్ నెంబరుకు తెలియజేయగలరు.

ఆకుల దుర్గా వరప్రసాదు
రికవరీ ఆఫీసరు
**PVR Vehicle Finance**
**e/o 2-126/1; T.Kothapalli,**
**I.Polavaram Mandalam.**
**Mobile No: 95813 47444**

**IN THE HON'BLE COURT OF THE 2nd ADDL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM.**
**I.P.No.26/2017**
**Between:**
**Korikana Sridevi ...Petitioner**
**And**
**Morla Bulli Raju and others ...Respondents**
**To**
**Respondent No.25**
**Sri.B.Venkata Reddy,**
**S/o.Rami Reddy, Hindu, Aged about 55 years,**
**Travel Business, R/o D.No.D-24,**
**Sukhibhava Lay out,**
**Chittivalasa, Bheemunipatnam Mandal,**
**Visakhapatnam District.**

**NOTICE**

The petitioner filed Insolvency petition against respondents, you are 25th respondent in the above IP and the above matter is posted to **11-09-2019** for your appearance hence please take notice and appear before the Hon'ble 2nd Addl Senior Civil judge's Court, Visakhapatnam at **10.30 a.m,** if you fail to appear either in person or through advocate the matter will be decided against you by the Honourable Court.,

**By order of the Court.**
**Sri.N.Ravi Kumar**
**Advocate**
**Bheemunipatnam.**
**Visakhapatnam Dist.**
**Mobile No.9963817557**

# ఆశా వర్కర్ల ధర్నా



భీమునిపట్నం: ఎనిమిది నెలలుగా ఆశాలకి పారితోషకాలు, గౌరవవేతనాలు వెంటనే విడుదలచేయాలని ఆశాలకి నూతనంగా విడుదలచేసిన జాబ్ చార్ట్ ని రద్దు చెయాలని,సంక్షేమ పథకాలు ఆశాలకు అమలుచేయాలని స్థానిక అవంతీ కార్యాలయం వద్ద బుదవారం ఆశావర్కర్స్ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్య దర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు పదివేలు జీతం పెంచామని ప్రకటించగానే ఆశా వర్కర్స్ వారి కుటుంబ సభ్యులు చాలా అనంద పడ్డారని ఇంత లోనే వారి ఆసలను అడియాసలు చేస్తూ ప్రభుత్వం జీ వో విడుదల చేసిందని, ఈ జీ ఓ లో ప్రతీ పనికి పాయింట్స్ నిర్ణయించి అపాయింట్స్ ప్రకారం జీతం ఇస్తా మనడం అన్యాయమని ఈ ప్రకారం గత ప్రభుత్వం ఇచ్చిన జీతం కంటే తగ్గిందని గత ప్రభుత్వం ఆరువేలు తగ్గ కుండా జీతం ఇచ్చేదని మీరు పెంచిన జీతం పదివేలు అవుతుందని అంటే మీరు పెంచినది మూడువేల రూపాయిలు అని అన్నారు.

జాబ్ చార్ట్ కొత్త గా ఇచ్చింది రద్దు చెయాలని,అలాగే ఆరు నెలలో మా ప్రొగ్రెస్ బాగుంటే వుంచుతా మంటే దాని అర్ధం ఉన్న జాబ్‌ని తీసివేయాలని ఆలోచన మీకు ఉన్నదని మాకర్దమావుతోందని ప్రస్తుతం మాది శాశ్వత ఉద్యోగం మీరు టెంపరరీ చెయడం అన్యాయమని, మామీద పది మంది ని పర్యవేక్షణ పెట్టడం పిచుక మీద బ్రహ్మాస్త్రం సందించినట్లే అని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయుకులు ద్రాక్షాయని, ఆశా వర్కర్స్ ఎస్.రమ ఐమ్మ, సరస్వతి, సన్యాసి పైడమ్మ తదితరులు పాల్గొన్నారు. ,

# ఇరువాడలో నూతనంగా ఎంపికైన గ్రామ వాలంటీర్లకు నియామక పత్రాలు పంపిణీ



సబ్బవరం : మండలంలోని ఇరువాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం నూత నంగా నియమించిన గ్రామ వాలంటరీ లకు నియా మక పత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు వైయస్ఆర్ సీపీ నేత బలిరెడ్డి కనకరాజు పాల్గొని ఎనిమిది మంది గ్రామ వాలంటరీ లకు నియామక పత్రాలు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాలెంటర్ కు ఎంపిక చేసిన 50 కుటుంబాలు ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. గ్రామ వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేయాలన్నారు. రాజకీయ అతీతంగా, కులాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటింటికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రామకోటి. వైసీపీ నేతలు బలిరెడ్డి కనకరాజు. బలిరెడ్డి ఈశ్వరరావు. మచ్చ కోటేశ్వరరావు. మామిడి బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణం తొలగింపు



మధురవాడ : విశాఖ రూరల్ రెవెన్యూ అధికారులు ఆక్రమణలపై కొరడా ఝులిపిస్తున్నారు బుధవారం మధ్యాహ్నం బక్కన్నపాలెం 16 వ బెటాలియన్ ఎదురుగా సర్వే నెంబర్ 37 , 38 ఉన్న మూడెకరాల ప్రభుత్వ సీలింగ్ ల్యాండ్ లో ఒక షెడ్డు ని నిర్మించి, ఏకంగా ఆ ప్రభుత్వ భూమికి సైట్ ఫర్ సేల్ అని బోర్డు ని పెట్టి విక్రయానికి పాల్పడుతున్నారని సంఘటన రెవెన్యూ అధికారుల ద ృష్టికి రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో దానిని నేలమట్టం చేసి బోర్డులు తీసివేశారు. దీనికి సంబం ధించిన ఆక్రమణ దారులపై చర్యలు చేపడతామని రూరల్ మండలం తహసిల్దార్ ఆర్ నరసింహ మూర్తి వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో వీఆర్వోలు అప్పారావు, శ్యామ్, వీఆర్ఏలు బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన సీతాఫలం అమ్మకాలు

## ఆకాశాన్నంటుతున్న ధరలు



అనంతగిరి : కాశీపట్నం పేరు చెప్పగానే రుచి కరమైన సీతాఫలాలు ప్రతి ఒక్కరికి గుర్తుకు వస్తాయి. ప్రతి ఏడాది ఆగస్టు నెల నుంచి అందు బాటులో ఉండే మధురమైన ఈ సీతాఫలాలు అమ్మకాలు ప్రస్తుతం ప్రారంభం అయ్యాయి కాశీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు వీటిని వారపు సంత తీసుకువచ్చి విక్రయించి వారికి కావలసిన సామాగ్రి తీసుకు వెళుతుంటారు అయితే అయితే తే సీతాఫలాలు సీజన్ సీతాఫలాల సీజన్ ప్రారంభం అయింది రైతులు తీసుకువచ్చిన ఫలాలను స్థానిక వ్యాపా రులు కొనుగోలు చేస్తున్నారు బుధవారం వచ్చిన వీటి ధర ఆకాశా న్నంటింది సుమారు 200 సీతాఫలాలు ఉండే కావిడీ ధర 3 వేల రూపాయలు వరకు పలకటం గమ నార్హం. అయినప్పటికీ అందు బాటులోకి వచ్చిన కొన్ని ఫలాలను పోటీపడి వ్యాపారులు కొనుగోలు చేశారు అదేవిధంగా సంతలో రహదారి ఇరుపక్కల దుకాణాలు ఏర్పాటు చేసి డజను 200 రూపాయలకు చిరు వ్యాపారులు విక్రయిస్తున్నారు.

సీతాఫలం కాయల సీజన్ అక్టోబర్ నెల వరకు లభ్యమయ్యే అవకాశం ఉంది రాను రాను ఈ సీతాఫలాలు ధర ఇంకా పెరిగే అవకాశం ఉంది.

# ఉపాధి బకాయిలు చెల్లించాలి



ఉపాధికూలీతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు కాశీపట్నం ఏరియా నాయకులు

అనంతగిరి : అనంతగిరి మండలంలో గల పలు గ్రామ పంచాయతీల, పంచాయతీ హాలో ఉపాధి బకాయిలను ప్రభుత్వము చెల్లించకపోవడం వలన ఎన్ఆర్ఇజిఎస్ కూలీలు ఇబ్బందులు పడుతున్నా రని గిరిజన సంఘం కాశీపట్నం ఏరియా కార్యదర్శి కె.సింగ్ అన్నారు. కాశీపట్నం కొత్తూరు ఎన్ ఆర్ పురం భీంపోలు, గరుగుబిల్లి పంచాయతీలలో ఉపాధి కూలీలకు ఎంత మేర సొమ్ము బకాయి దానిపై ఇప్పటికే తాము సర్వే చేసినట్లుగా అయినా విజయవాడ ప్రతినిధికి తెలిపారు ప్రతి పంచాయతీకి లక్షల్లో కూలి బకాయిలు ఉన్నట్లుగా ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు వెళ్లి కూలీలతో మాట్లాడినట్లుగా పేర్కొన్నారు. కాశీపట్నం పంచా యతీ లను సుమారు 15 లక్షల బకాయిల ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వం నాలుగు నెలలుగా చెల్లించక పోవడం వలన ఈ బకాయిలు పెరిగిపోయాయి అని అని తెలిపారు భీంపోలు పంచాయతీ లో సుమారు 20 లక్షల రూపాయలు బకాయిలు ఉన్నాయని ఇది సిగ్గు చేటని ఆయన అన్నారు. ప్రభుత్వం నాలుగు నెలల నుంచి పేమెంట్లు పూర్తిగా చేయకపోవడం వలన కూలీలు చాలా ఇబ్బంది పడుతున్నారు...

కూలీలు సొమ్ము చెల్లించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని లేనట్లయితే మండల కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడ తామని వారు హెచ్చరించారు.

# రాజకీయ లబ్ధి కోసమే ఆర్టికల్స్ 370 రద్దు

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



అనంగిరి : అనంతగిరి గిరిజన సంఘం కార్యా లయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్టికల్స్ 370 రద్దు పై చర్చ జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కేంద్రంలో బీజేపీ అధి కారం లోకి వచ్చిన తర్వాత ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర హక్కులను హరిస్తుం దని ఆయన అన్నారు రాజకీయ స్వలాభం కోసమే జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర స్వయం ప్రతిపత్తి ఆర్టికల్స్ 370 రద్దు చేసిందని తెలిపారు. ఈ తరుణంలో లౌకిక ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగరాజు దేవన్న అప్పలరాజు పూర్ణనందు నాగులు పాల్గొన్నారు.

# 25న (ఈహెచ్ఎస్)
# ఉచిత కంటి వైద్య శిబిరం

సబ్బవరం : మండల కేంద్రంలోని ఎమ్ఈఓ ఆఫీసు నందు ఈ నెల 25వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు (ఈహెచ్ఎస్) రాజమండ్రి అకిరా కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడునని బుధవారం విలేకర్లకు విశ్రాంత ఉద్యోగులు తెలిపారు.

ఈ ఉచిత వైద్య శిబిరం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగుల వారి కుటుంబ సభ్యులకు మరియు అన్ని రకముల ఆరోగ్య భీమాదారులకు కంటికి సంబంధించిన వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేయబడును. అలాగే ఈ పథకంలో అను మతించబడిన శస్త్ర చికిత్సలు మాత్రమే ఉచితంగా చేయబడునని తెలిపారు.

కావున విశ్రాంత ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవు

### మున్సిపల్ కమిషనర్ జి.శేఖర్

పెద్దాపురం : ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్లను పెద్దాపురం పట్టణంలో వ్యాపారస్తులు వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జి.శేఖర్ తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు అమ్మే వ్యాపారులు మరియు వాటిని విని యోగించే చిన్న వ్యాపారస్తులతో కలిసి బుధవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో హెచ్చరికలు జారీ చేశారు. పెద్దాపురం పట్టణంలో ఇటీవల తనిఖీ చేసిన నేపథ్యంలో ప్లాస్టిక్ కవర్లు విరివిగా వ్యాపారస్తులు వినియోగిస్తున్నట్లు గుర్తించామని, దీనిని అధిగ మించడానికి మున్సిపల్ అధికారులు తనిఖీ చేస్తారని, ఈ తనిఖీలో ఎవరైనా ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు జరిపినా, చిన్న వ్యాపారస్తులు కొనుగోలు చేసిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ప్రజారోగ్య పరి రక్షణలో భాగంగా ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్లు నిషేధించడం జరిగిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని, సొంత బ్యాగులు ఉపయో గించుకునే పరిస్థితి అలవర్చుకోవాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ డేవిడ్ రాజు, పట్టణంలోని వర్తకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.ఎం.ఎం.ఎస్. కు
# కాపులుప్పాడ విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలి మండలంలో కాపులుప్పాడ లో ఎనిమిదవ తరగతి పిల్లల కొరకు నేషనల్ మీన్స్ ఆఫ్ మెరిట్ స్కాలర్ (ఎన్.ఎం.ఎం.ఎస్) 1300 వందలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు, వీరిలోఎన్. ఎం.ఎం.ఎస్. వారు కొంత మందిని సెలెక్ట్ చేశారు. వారిలో ఎం.పి.యు. పి స్కూల్ విద్యార్థులు, చెన్నా. యశ్వంత్ , తోలాడ. మౌనిక ఇద్దరు ఎంపికయ్యారు. అలాగే జెడ్పి హెచ్ స్కూల్ విద్యార్థి భూసి. జోష్న ఎంపికయ్యారు. వారు ప్రతిభను గుర్తించి విశాఖ కింగ్ మేకర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ధోని.నాగరాజు ఆధ్వర్యంలో వారుకి గుర్తింపుగా ప్రైజస్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్, వైసిపి వైజాగ్ సౌత్ ఇంచార్జ్, మత్స్యకార నాయకులు, బుడ్డ.నీలకంఠం ప్రైజేస్ ఇవ్వడం జరిగింది. కింగ్ మేకర్ సభ్యులు దోని.నాగరాజు వూళ్ల.సురేష్, చీపుళ్ళ. ఎల్లాజి, దౌలపల్లి. ఏళ్ళాజీ, నాగ్రి.విష్ణు ప్రసాద్, వూళ్ళ.పరదేశి, బొడ్డు.గణేష్ మిగిలిన సభ్యులు పాల్గొన్నారు.

## సనాతన ధార్మిక విజ్ఞాన పరీక్షలలో
## తిమ్మాపురం విజ్ఞాన్ విద్యార్థులు ప్రతిభ

భీమునిపట్నం: తిరుమల తిరుపతి దేవస్థానం హింధూ దర్మప్రచార పరిషత్ నిర్వహించిన 36 వ పరీక్షలో విజ్ఞాన్ విద్యా లయం ఆరు ఏడు ఎనిమిడది తరగతుల చదువుచున్న విద్యా ర్థులు ప్రతిభ కనబరిచారు. పరీక్షలు వ్రాసిన ఏబై మంది మందిలో ఇరవై నాలుగు మందికి ప్రదమశ్రేణి పదకొండు మందికి ద్వితీయ శ్రేణి లో పాస్ అయ్యారు.ఈ సందర్భంగా సంస్థ ఏ డి శ్రీకాంత్ మాట్లాడుతూ చదువుతో పాటు దా ర్మిక విషయలలో విద్యార్థులు ప్రతిభ చూపించారని అన్నారు. విద్యార్థులను ఏడి శ్రీకాంత్, ప్రిన్స్ పాల్ పద్మావతి, ఉపాద్యాయులు వేదుల శివమర్తాండ శర్మ అభినందించారు.

# భూ కబ్జాలకు పాల్పడితే జైలుకే

### విశాఖ రూరల్ తాసిల్దార్ నరసింహమూర్తి



మధురవాడ : ప్రభుత్వ భూములు ఆక్రమణకు పాల్పడితే ల్యాండ్ గ్రాబింగ్ కేసులతో పాటు పి.డి యాక్ట్‌లు పెట్టి జైలుకు పంపిస్తామని విశాఖ రూరల్ తాసిల్దార్ నరసింహమూర్తి తెలి పారు. బుధవారం రూరల్ తాసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధురవాడ, పీఎం పాలెం, బక్కన్నపాలెం, కొమ్మాది, మారికవలస, పరదేశి పాలెం, తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ లో భూముల్లో అక్రమాలకు పాల్పడితే వెంటనే తొలగించి వాటిని స్వాధీనపరచు కోవడానికి వెనకాడబోమని తెలిపారు. గతంలో జరిగిన భూ అక్రమాలపై ఇప్పటికే పలు ప్రాంతాల వారీగా తమ సిబ్బంది పూర్తిస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారని నివేదిక ఆధారంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని శాఖల సహకారంతో పూర్తిస్థాయిలో భూ ఆక్రమణలను అరికడతామని ప్రభుత్వ భూమిని పరిరక్షిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తాసిల్దారు మీ రవిశంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సర్వే సక్రమంగా చేయండి

### ఎంపీడీవో అబ్బిరెడ్డి

పెద్దాపురం : గ్రామ వాలంటీర్లు కుటుంబ సర్వేని సక్రమంగా నిర్వర్తించాలని పెద్దాపురం ఎంపీడీవో అబ్బిరెడ్డి రమణారెడ్డి ఆదేశించారు. మండలంలో గల వడ్లమూరు గ్రామంలో వాలంటీర్లు చేస్తున్న కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు వారికి కేటా యించిన 50 కుటుంబాలకు సంబంధించిన పూర్తి డేటాను సేకరించవలసి ఉన్నదని అన్నారు. వాలంటీర్లు విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని తెలిపారు. అదేవిధంగా స్వచ్ఛ సర్వేక్షణ బృందం, ఆయా గ్రామాలలో పర్యటిస్తున్న నేపథ్యంలో గ్రామాలలో పారిశు ధ్యం మెరుగుపరచాలని పంచాయితీ కార్యదర్శులకు ఎంపీడీవో ఆదేశించారు.

# ఆశా వర్కర్ల ధర్నాకు
# టీడీపీ మద్దతు

భీమునిపట్నం: రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న ఆశ వర్కర్ల న్యాయమైన పోరాటానికి బుధవారం టిడిపి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా గంటా నూక రాజు మాట్లాడుతూ. తెలుగుదేశం పార్టీ హయాంలోనే ఒక్కొక్కరు 7,000 రూపాయల నుండి 8,000 రూపాయల వరకు నెలకు సంపాదించారని. ఈ విధంగా వారియొక్క కుటుంబ పోషణలో వీరి యొక్క పాత్ర వెలకట్టలేనిదని, కష్టానికి తగ్గట్టు ప్రతిఫలం వచ్చేది, వీరుకూడా చాలా హుందాగా ఉద్యోగం చేసే వారని నూకరాజు తెలియజేశారు. ప్రస్తుతము ఉన్న ముఖ్య మంత్రి జగ న్మోహన్ రెడ్డి ఆశ వర్కర్స్ కి నెలకి 10,000 రూపా యలు చేస్తూ ఎ. బి.సి.డి. గ్రేడులుగా విభజించడం, ఇన్సెం టివ్ తీసి వేయడంతో మమ్మల్ని ఎ. బి.సి.డి.లుగా విభజించ వద్దని, అందరికీ సమాన వేతనం సమాన ఇన్సెంటివ్ ఇవ్వాలని శాంతియుతంగా ధర్నాలు చేస్తుంటే పోలీసులను ఉపయోగించి వీరిని బయభ్రాంతులకు గురిచేయడం, కావాలని కేసులు పెట్టి ఇరికించడం చేసి రాక్షస పాలన ఎలా ఉంటాదో నిరూపిస్తున్నారని గంటా నూకరాజు ఆరోపించిరి. ఆశ వర్కర్స్ వారు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను పరిశీలించి, పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ భీమునిపట్నం డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. తెలుగుదేశం పార్టీ హయాంలోనే ఆశ వర్కర్స్ కి నెలకి ఇన్సెంటివ్ తో కలిపి నెలకు పదివేలు వరకు వచ్చేదని, జీతం పెంచు తున్నట్లుగా చెప్పి గ్రేడులు పెట్టడం, ఇన్సెంటివ్ లు తీసివేయడం సరికాదని ప్రభుత్వం మరొక సారి ఆలోచించి ఆశ వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ కి మా పార్టీ తరపున మీకు అండగా ఉంటామని, మా మద్దతు మీకు ఎల్లవేళలా ఉంటాదని తెలియజేశారు.

# ప్రశాంతంగా ముగిసిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం ఎన్నికలు

- ఉత్కంఠ పోరులో షుగర్ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్ 3వ సారి హ్యాట్రిక్ గెలుపు
- అంబరాన్నంటిన కార్మికుల సంబరాలు,
- 12 ఓట్లు తేడాతో ఓటమి పాలైన షుగర్ వర్కర్సు యూనియన్



హ్యాట్రిక్ విజయం సాధించిన రామునాయుడుకు స్వీట్లు తినిపిస్తున్న ఫ్యాక్టరీ ఎం.డి.కె.ఆర్.విక్టర్ రాజు



విజయోత్సవం ర్యాలీలో కార్మికులకు అభివాదం చేస్తున్న శరగడం రామునాయుడు

చోడవరం : చోడవరం సహకార చక్కెర కర్మాగారంలో షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘాలకు బుధవారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉత్కంఠ పోరులో షుగర్ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్ ముచ్చటగా మూడవ సారి కుర్చీ గుర్తుతో బరిలోకి దిగిన శరగడం రామునాయుడు హ్యాట్రిక్ విజయం సాధించడంతో కార్మికుల సంబరాలు అంబరాన్నంటాయి. మరొక వైపు గులాభి పువ్వు గుర్తుతో బరిలోకి దిగిన ప్రత్యర్ధి కార్మిక సంఘం నాయకులు కె.బాష్కరరావు చివరి దశలో కేవలం 12 ఓట్లు తేడాతో ఓటమి పాలయ్యారు. ఫ్యాక్టరీలో మొత్తం 435 మంది కార్మికులు ఓటు హక్కు కలిగి ఉండగా, 432 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీటిలో 221 ఓట్లు షుగర్ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్ నాయకులు రామునాయుడుకు రాగా, 209 ఓట్లు ప్రత్యర్ధి కె.బాస్కరరావుకు పోలయ్యాయి. గతంలో మొదటిసారిగా బరిలో నిలచిన రామునాయుడు ఫ్యానెల్ 23 ఓట్లు, రెండవ సారి 77 ఓట్లుతో విజయం సాధించగా, ఈ సారి 12 ఓట్లు మెజారిటీతో విజయం సాధించి గెలుపు ముంగిట నిలిచారు. కార్మికులే తమ బలమని, కార్మికుల సమస్యలే మా ఎజండా అని, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా రామునాయుడు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆశీర్వచనాలతో విజయం సాధించామని, కార్మికుల సమస్యలు పరిస్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. మూడవ దఫా విజయం సాధించిన రామునాయుడుకు ఫ్యాక్టరీ ఎం.డి.కె.ఆర్.విక్టర్ రాజు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా షుగర్ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్ విజయం సాధించడంతో కార్మికుల సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ఆవరణ నుండి ప్రధాన రహదారి మీదుగా డప్పులు, బాజా బజంత్రీలతో పలు ఆలయాల వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షుగర్ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.ఎస్.నాయుడు, అధ్యక్షులు రాయి సూరిబాబు, జాయింట్ శెక్రటరీ జె.వి.శ్రీను, ట్రెజరర్ కె.ఎస్. ప్రకాష్, గాతాడ హేమంత్ కుమార్, దేవరపల్లి చంటి,కనిశెట్టి ఈశ్వరరావు, ఆళ్ల రామకృష్ణ, లెక్కల వెంకటరమణ, ఉత్తరాంధ్రా వేదిక కన్వీనర్, కొణతాల ప్రధాన అనుచరులు తనకల జగన్, తాతంనాయుడు పెద్ద సంఖ్యలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# 23 నుండి సురభి నాటకాలు



అనకాపల్లి : ఈనెల 23 నుండి మూడు రోజుల పాటు సురభీ నాటకాలు నిర్వహించడం జరుగు తుందని, నిర్వాహకులు గొంతిన శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కశింకోట మండలంలోని సోమవారం గ్రామంలో ఉన్న షిరిడీ సాయిబాబ ఆలయ సప్తమ వార్షి ోత్సవం సందర్భంగా ఈ నాటిక పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 25న జరిగే వార్షికోత్సవ వేడుకల సందర్భంగా శుక్ర, శని, ఆదివారాలలో ప్రతీ రోజు రాత్రి 8.30 గంటలకు వరుసగా భక్త ప్రహ్లాదా, శ్రీకృష్ణలీలలు, మాయాబజార్ నాటికలు ప్రదర్శించడం జరుగు తుందన్నారు. 133 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన సురభీ నాటక సంస్థ శ్రీవిజయభారతి నాట్య మండలి వారిచే ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. అలాగే ఆకరిరోజైన 25వ తేదీన మద్యాహ్నం 12 గంటల నుండి పది వేల మందిరి భారీ అన్నసమారాధన నిర్వహించడం జరుగు తుందన్నారు.

అనంతరం తిరువీధి ఊరేగింపు ఎస్. రాయవరం వేమగిరి వారిచే బాలాజీ బాలికల బృందం వారి కోలాటం, తోడపెద్దు సేవ, హరిభజన, ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలతో అలంకరించడం జరుగుతుందన్నారు. గ్రామస్తులతో పాటు, జిల్లా ప్రజానీకం పాల్గొని వార్షికోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని, శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

# ఉపాధ్యాయిని రామలక్ష్మి దాతృత్వం



అచ్యుతాపురం : విద్యాబుద్ధులు నేర్పుతూ తమ పాఠశాల విద్యా ర్థులకు విద్య సామాగ్రి అందించడంతో పాటు దివ్యాంగులకు చేయూత నిస్తున్నారు. అవరాజం పాఠశాల ఉపాధ్యా యిని రామ లక్ష్మి బుధ వారం ఆమె స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగు విద్యార్థు లకు తన సొంత నిధులతో రైటింగ్ పాడ్స్ పంపిణి చేశారు. ఈ కార్య క్రమంలో ఎన్ శ్రీనువాసురాజు, జనవిజ్ఞానవేదిక ప్రతినిధి మారిశెట్టి వెంకటప్పారావు, జగదాంబ తది తరులు ఉన్నారు.

## వాలంటీర్లీ విదివిదానాలుపై పరవాడలో కార్యక్రమం



పరవాడ: మండలకేంద్రమైన పరవాడలో గల వాలంటీర్లు ప్రజలుకు అందించే విదివిదానాలుపై బుదవారము కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా వైసిపి రాష్ట సిఇసి సభ్యులు పైల(శీనువాసురావు, వైసిపి జిల్లా ప్రదానకార్యదర్శి చుక్కరాము నాయుడు, మండలపార్టి ప్రెసిడెంట్ సిరపురపు అప్పలనాయుడు పోల్గొన్నారు. ముందుగా వాలంటీరీ అభ్యర్దిలు అందరినీ పరిచయము చేసుకున్నారు. అనంతరము అతిథిలు మాట్లడుతూ కుల,మత,వర్గ,లింగ విచిక్షిత లేకుండా ప్రభుత్వము నుండి వచ్చె సంక్షేమ పథకాలుఅన్ని ప్రజలుకు అందించడమే వాలంటీర్లుగా మీబాద్యతఅని తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయితీ విస్తరణాదికారి పద్మజ,పంచాయితీ కార్యదర్శి అచ్చుతరావు, వైసిపినాయకులు బండారురామారావు,వైసిపి యూత్ నాయకులు చుక్కరవికుమార్ , గండిఈశ్వరావుతథితర్లు పోల్గోన్నారు.

## నాయిబ్రాహ్మణసంఘం కార్యవర్గం ఎన్నిక



కాకినాడ: ఏపీ నాయిబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా నూతన కార్యవర్గ సమావేశం కాకినాడ గాంధీభవన్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్రఅధ్యక్షులు ఏఎస్ఎన్ మూర్తి అధ్యక్షత వహించారు.ముఖ్య అతిధిగా ఏపీ నాయి బ్రాహ్మణ లీగల్ సెల్ ఛక్మర్మన్ జి.రామ పుల్లయ్య ముఖ్యఅతిధిగా విచ్చేసి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఈసందర్భంగా రాష్ట్రఅధ్యక్షుడు ఎఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాయిబ్రహ్మణులందరినీ ఒక్కతాటిపైకి తీసుకురావరానికే ఈసమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రాష్ట్రంలో ఉన్న నాయి బ్రాహ్మణులంతా కలసి ఉంటే రాష్ర్టప్రభుత్వం నుండి రావాల్సిన సంక్షేమ పథకాలు పొందేఅవకాశం ఉంటుందన్నారు. అనంతరం నాయి బ్రహ్మణుల సంక్షేమానికి శివఅక్తి వంచన లేకుండా పనిచేస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి నాయి బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కొత్తూరు మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా మచ్చపల్లి దుర్గాప్రసాద్ , గౌరవఅధ్యక్షులుగా బెలపూడి రామకృష్ణ, వర్కింగ్ అధ్యక్షులుగా చిట్టాపత్తుల నాగబాబు, కోశాధికారిగా కోడూరి శ్రీను,ప్రధాన కార్యదర్శిగా స్వయంవరపు శ్రీను, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

## ఆదిత్య "వేద -2కె19" పోస్టర్ విడుదల



గండేపల్లి : సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలు సంయుక్తంగా నిర్వహించే "వేద-2కె19" స్పిరిట్ ఆఫ్ ఇన్నోవేషన్ పేరిట నిర్వహించే జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ పోస్టర్ ను ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీర్స్ డే (మోక్షగుండం విశ్వేశరయ్య జన్మదినం) పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఆదిత్య లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ "వేద-2కె19" ద్వారా భావి ఇంజనీర్స్ యొక్క స ృజనను వెలికి తీసేందుకు తద్వారా విద్యార్థుల నూతన ఆవిష్కరణలను విజ్ఞాన ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా "ఆదిత్య-వేద" విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ సంవత్సరం కూడా సెప్టెంబర్ 13,14 శుక్ర,శనివారాలలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు సతీష్ రెడ్డి తెలిపారు.

క్యాంపస్ డైరెక్టర్ అండ్ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎమ్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఆదిత్య వేద నిర్వహిస్తున్న సంగతి విదితమే అని, అలాగే రాష్ట్రంలో గల ఇంజనీరింగ్ కళాశాలలకే కాకుండా ఇతర రాష్ట్రాలలో గల ఇంజనీరింగ్ కళాశాలలకు సైతం ఆహ్వానాలు పంపిస్తున్నామని,వివిధ ప్రాంతాల నుండి వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. వివిధ బ్రాంచ్ లలో పేపర్,పోస్టర్,ప్రాజెక్ట్ విభాగాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని ప్రథమ, ద్వితీయ, త ృతీయ స్థానాలలో నిలిచిన విజేతలకు బహుమతులు (నగదు,జ్ఞాపిక,ప్రశంసాపత్రం) ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రతి విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహించుటకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని,సాంస్క ృతిక కార్యక్రమాలతో ఆద్యంతం ఎంతో ఆహ్లాదకరంగా విజ్ఞాన దాయకంగా సాగేందుకు ఈ వేద రూపొందించడం జరిగిందని మరిన్ని వివరాలకుడబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎఇసి.ఇడియు. ఇన్./విఇడిఎ2019 సైట్ ను చూడవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రిన్సిపాల్స్ డా.టి.కె.రామక ృష్ణారావు,డా.ఆదిరెడ్డి రమేష్,వైస్ ప్రిన్సిపాల్ డా.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మానవ సేవే మాధవ సేవ:డా. మానికి రెడ్డి

### ప్రపంచ మానవతా దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమం



కాకినాడ : మానవ సేవే మాధవ సేవని సమాజ సేవకుడు, మానవతా వాధి మానికి రెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ అధినేత మానికి రెడ్డి సత్యన్నారాయణ అన్నారు. ప్రపంచ మానవతా దినోత్సవం పురస్కరించుకొని ఆదిత్యడిగ్రీ కళాశాల విద్యార్థులచే స్థానిక రామారావు పేటలోని జనావళి వృద్ధాశ్రమంనకు సుమారు12 వేలు విలువ చేసే గృహోపకరణాలు( గ్రైండర్, వాటర్ ఫల్లర్ ,మిక్సర్) అందజేసారు.ఈ కార్యక్రమంలో చిరంజీవిరావు,సింహాద్రి,ఎన్ఎస్ వాలంటీర్లు ఆదిత్య విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## 23న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కాకినాడ రూరల్: కాకినాడ గ్రామీణం కొవ్వూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీఉమాసోమేశ్వర స్వామి ,శ్రీభువనేశ్వరీ సమేత అమ్మవారి ఆలయంలో ఈ నెల 23న శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయఅర్చకులు చావలి అగ్నిహోత్రవినాయకశర్మ తెలిపారు.అన్నవరం సత్యనారాయణ స్వామివారి సహకారంతో ఈ వ్రతములు మరియు కుంకమపూజ నిర్వహించడం జరుగుతుందని భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2019 లో పాల్గొనండి

**గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి.**

**స్వఛ్ఛ సర్వేక్షణ్ లో జిల్లా రాష్ట్రంలో ప్రథమం.**

**స్వఛ్ఛ సర్వేక్షణ్ కు ఎస్.ఎస్.జి.-2019 ప్రత్యేక యాప్**

**జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి.**

కాకినాడ: కేంద్ర ప్రభుత్వ స్వఛ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2019లో ప్రజలందరూ పాల్గొని స్వఛ్ఛ గ్రామాలను తద్వారా స్వఛ్ఛ జిల్లాగా రూపొందించాలని జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వఛ్ఛ సర్వేక్షణ్ -2019 పై జిల్లాలో నిర్వహించనున్న క్షేత్ర స్థాయి సర్వే పై బుధవారంనాడు కాకినాడ కలక్టరేట్ లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో కలక్టర్ మాట్లాడుతూ దేశంలో స్వఛ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంను మహాత్మాగాంధీ 150వ జయంతి, అక్టోబర్ 2, 2019 నాటికి పూర్తి అవుతుందని, ఈ కార్యక్రమం పై వివిధ రాష్ట్రాల్లోని జిల్లాల్లో అమలు జరుగుచున్న పారిశుధ్యం, పరిశుభ్రత ప్రత్యేక టీములు ఆగష్టు 15 నుండి సెప్టెంబరు 25 వరకు క్షేత్ర స్థాయిలో పర్యటించి గ్రామాల్లో నెలకొని వున్న పరిస్థితుల పై నివేదికలను అందిస్తాయని అన్నారు. ఈ నివేదికలు ఆధారంగా ఉత్తమంగా వచ్చిన రాష్ట్రాలకు ప్రత్యేక గ్రాంటును కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని అన్నారు. ఈ విధంగా రాష్ట్రానికి గత సంవత్సరం 97 కోట్లు విడుదల చేసారని అన్నారు. అదే విధంగా ఈ సంవత్సరం 29 కోట్లు ప్రత్యేక గ్రాంటు వచ్చే అవకాశము వుందని అన్నారు.

## ఆమదాలవలసలో వెటర్నరీ పాలిటెక్నిక్ నెలకొల్పాలి

శ్రీకాకుళం: ఆమదాలవలసలో వెటర్నరీ పాలిటెక్నిక్ ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి మోపిదేవి వెంకట రమణను కోరారు. ఆమదాలవలస నియోజకవర్గంలో పశుసంవర్ధక కార్యకలాపాలపై శాసన సభాపతి సీతారాం, మంత్రి మోపిదేవి వెంకట రమణ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులతో అమరావతిలో శాసనసభ ప్రాంగణంలోగల శాసన సభాపతి కార్యాలయంలో బుధ వారం సమీక్షించారు. ఈ మేరకు సభాపతి కార్యాలయం నుండి పత్రికా ప్రకటన విడుదల చేసారు. ఆమదాలవలసలో వెటర్నరీ పాలిటెక్నిక్ ఆవశ్యకత ఉందని, దానిని వెంటనే మంజూరు చేయుటకు ప్రయత్నించాలని సభాపతి కోరారు. వ్యవసాయపరంగా ఆమదాలవలస నియోజకవర్గానికి మంచి ప్రాధాన్యత ఉందని అన్నారు. వంశధార కాలువ, నారాయణపురం ఆనకట్ట, రెల్లిగెడ్డ తదితర మంచి జలవనరుల సౌకర్యం ఉందని పాడి అభివృద్ధి జరగాలని ఆయన పేర్కొన్నారు. పాడి పంట రెండు పుష్కలంగా ఉండటం వలన రైతులకు ఆదాయం పెరుగగలదని చెప్పారు. ప్రకృతి వ్యవసాయానికి పశు వుల అవసరం ఎంతో ఉందని అన్నారు. ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలో జంతువధ శాల మంజూరు చేయాలని కోరారు.

ఆమదాలవలస భౌగోళిక ప్రాధాన్యత కలిగిన ప్రదేశమని పేర్కొంటూ అటువంటి ప్రదేశంలో జంతువధ శాల లేకపోవడం ఆరోగ్యానికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు. 13 పశువైద్య శాలలకు కొత్త భవనాలు, 9 పశువైద్య శాలల భవనాల మరమ్మతులు చేపట్టాలని కోరారు. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో కొత్తగా పశువైద్య శాలను ఏర్పాటు చేయాలని కోరారు.

సిబ్బంది కొరత ఉందని త్వరితగతిన భర్తీ చేసి సేవలను రైతులకు చేరువ చేయాలని అన్నారు. మంత్రి మోపిదేవి వెంకట రమణ మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంటు పోస్టులను భర్తీ చేస్తున్నామని తద్వారా సిబ్బంది కొరత కొంతం మేర తీరగలదని అన్నారు.

## నేను ఎలాంటి నేరం చేయలేదు: చిదంబరం



దిల్లీ: తనపై సీబీఐ, ఈడీకి చెందిన ఎలాంటి కేసులూ లేవని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం అన్నారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసు విషయంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఆయన మీడియా ముందుకు వచ్చారు. దిల్లీలోని కాంగ్రెస్ కార్యాలయంలో చిదంబరం మీడియాతో మాట్లాడుతూ తాను ఎలాంటి నేరం చేయలేదని.. సీబీఐ, ఈడీ నుంచి ఎలాంటి ఛార్జిషీట్ తనపై లేదని చెప్పారు. ఈ అంశంలో తనతో పాటు కుమారుడిపైనా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ఎఫ్ఐఆర్ నమోదైనంత మాత్రాన ఎవరూ నేరస్థుడు కాదని చిదంబరం వ్యాఖ్యానించారు. ఏడాదిన్నర పాటు మధ్యంతర బెయిల్‌పై ఉన్నానని ఆయన వివరించారు. చట్టాన్ని తాను గౌరవిస్తానని చెప్పారు.

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..



**మీ సంక్షేమం నా బాధ్యత**

**మధ్యంతర భృతి కోసం సీఎంతో మాట్లాడతా**

**త్వరలోనే జిల్లాల పర్యటనకు వస్తా**

**ఉగాది నాటికి 25 లక్షల మందికి పట్టాల పంపిణీ చేపట్టాలి**

**రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి చెరుకూరి శ్రీరంగనాథరాజు**

అమరావతి: ఇండ్ల నిర్మాణాలను, కేటాయింపులను పూర్తి పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా జరగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి చెరుకూరి శ్రీరంగనాథరాజు పేర్కొన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో వైఎస్ఆర్ గృహ నిర్మాణ పథకంపై రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, కార్పొరేషన్ హౌసింగ్ కి చెందిన పథక సంచాలకులు, కార్యనిర్వాహక ఇంజినీర్లుతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి చెరుకూరి శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ రాష్టంలోని ఇతర శాఖలకు హౌసింగ్ శాఖకు తేడా ఉందని, ప్రజలతో ప్రత్యక్షంగా సంబంధాలు ఉన్న శాఖ తమదన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలలో గృహ నిర్మాణం కీలకమైనదని ఆయన అన్నారు. క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు గృహ నిర్మాణాల స్థితిగతులను పిడిలు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పర్యవేక్షించాలన్నారు. గతంలో జన్మభూమి కమిటీల ఆధ్వర్యంలో ఎంపికలు జరిగిన విషయం తెలిసిందేనని, అటువంటి వాటికి తావు ఇవ్వకుండా పారదర్శకంగా, గృహాలు మంజూరు ఉండాలన్నారు. పాదయాత్రలో భాగంగా ప్రజల కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాలలో 25 లక్షల మందికి స్వంత ఇంటి కల నెరవేరుస్తానని మేనిఫెస్టో లో హామీ ఇచ్చారన్నారు. అర్హత గల లబ్ధిదారులకి ఇల్లు, ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీని చెప్పినందున అధికారులపై ఒత్తిడి తగ్గుతుందన్నారు. రాష్ట్రంలో గతంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు చెందిన రూ.840 కోట్లు పెండింగులో ఉన్నాయని , ఆర్థిక శాఖ మంత్రితోనూ, ముఖ్య కార్యదర్శి తోనూ మాట్లాడానని త్వరలోనే రూ.500 కోట్లు విడుదల చేసేందుకు సానుకూలంగా స్పందించారన్నారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచేందుకు ఆ దిశలో పనిచేయాల్సి ఉందన్నారు. సమస్యలు ఉన్నాయని వాటిని అధిగమించేందుకు తనవంతు కృషి చేస్తుంటానన్నారు. టిడ్ కో ప్రతినిధులు తనతో సంప్రదిస్తున్నారన్నారు. ఇండ్ల నిర్మాణల ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రజలకు అందుబాటులో ఉండేలా ఒక యాప్ అందుబాటులోకి తీసుకుని రావడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అనుసంధానం ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో ఉండాలని మంత్రి ఆదేశించారు. ఇండ్ల ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. రాష్ట్రంలోని 175 నియోజక వర్గాల్లో 124 నియోజక వర్గాలు భారత ప్రభుత్వ పట్టణ హౌసింగ్ పరిధిలో ఉన్నాయని, రాష్ట్రంలో చేపట్టే ఇండ్ల నిర్మాణాల నిధుల కోసం కేంద్ర మంత్రివర్యులతో మాట్లాడి రాష్ట్రానికి నిధులు తీసుకుని రావడం జరుగుతుందని మంత్రి శ్రీ రంగధరాజు పేర్కొన్నారు. మీ సంక్షేమం నా బాధ్యతని, సమస్యలు ఉంటాయని, క్షేత్ర స్థాయిలో విధుల్ని నిబద్ధతో చేపట్టాలని కోరుతున్నానని తెలిపారు. కుటుంబ బాధ్యతలని ఏవిధంగా నిర్వర్తిస్తారో అదేవిధంగా విధుల్లో కూడా చూపాలని స్పష్టం చేసారు. ఇటీవల బదిలీల సందర్భంలో అధికారులు, ఇంజినీరులు సహకరించారన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి మంధ్యంతర భృతి కోసం కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకి అన్ని విధాలుగా ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

రాష్ట్రంలో చేపట్టనున్న గృహ నిర్మాణం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు కలసి ముందుకు వెళదామని మంత్రి తెలిపారు. భూసేకరణ సమస్యను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లు ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. శాసన సభ్యులను కూడా భాగస్వామ్యం చేసుకుని వెళ్లాలని మంత్రి సూచించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ జి.అనంతరామ్, ఎండి కాంతిలాల్ దండే రాష్ట్రంలో గృహ నిర్మాణం ప్రగతి వివరాలను సమీక్షలో మంత్రికి వివరించారు. సమావేశంలో 13 జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్ లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, హెడ్ ఆఫీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజధానిపై ప్రజలు ఆందోళనతో ఉన్నారు:సుజనా

దిల్లీ: వరదలపై సీడబ్ల్యూసీ హెచ్చరించినా ఏపీ ప్రభుత్వం ఎందుకు అప్రమత్తం కాలేదని భాజపా ఎంపీ సుజనా చౌదరి ప్రశ్నించారు. కావాలనే వరదనీటిని ప్రభుత్వం కిందికి వదిలిందా? రాజధాని ప్రాంతాన్ని ముంచాలని చూస్తున్నారా? అంటూ మండిపడ్డారు. వరదలతో 50వేల ఎకరాల్లో పంటనష్టానికి బాధ్యులెవరని నిలదీశారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో సుజనా మాట్లాడారు.

వరద నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. రాజధాని విషయంలో ప్రజలు ఆందోళనతో ఉన్నారని.. దీనిపై మంత్రులు బొత్స, అవంతి శ్రీనివాస్ తలోరకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాజధాని అంశంలో మంత్రుల అభిప్రాయాలు ప్రభుత్వ వైఖరా? వ్యక్తిగతమా?అన్నది స్పష్టం చేయాలని సుజనా డిమాండ్ చేశారు. అమరావతిలో ఇప్పటికే ప్రభుత్వం రూ.కోట్లలో ప్రజాధనం పెట్టిందని.. అనేక భవనాలు కూడా సిద్ధమయ్యాయని చెప్పారు.

## మార్కెట్లోకి కొత్త హ్యుందాయ్

# గ్రాండ్ ఐ10 నియోస్

### ప్రారంభించిన ఉప రవాణా కమిషనర్ రాజరత్నం



విశాఖ సిటీః ప్రపంచ శ్రేణి ప్రముఖ వాహన తయారీ కంపెనీ హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్ఎంఐఎల్) తమ నూతన కాంపాక్ట్ సెగ్మెంట్ పోర్ట్‌ఫోలియోలో 'గ్రాండ్ ఐ10 నియోస్ ' కారును విశాఖ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. విశాఖపట్నం రామాటాకీస్ లక్ష్మీ హుండాయ్ షోరూం వేదికగా ప్రారంభించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన విశాఖపట్నం డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (ఉప రవాణా కమిషనర్) పి. రాజరత్నం ప్రారంభించారు.

గ్రాండ్ ఐ10 నియోస్‌లో పెట్రోల్ వేరియంట్ ప్రారంభ ధరను 4.99 లక్షలు (ఎక్స్ షోరూం) కాగా హైహేండ్ కారు ధర 7.14 లక్షలుగా నిర్ణయించినట్లు హ్యుండాయ్ కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ నూతన మోడల్ అంతర్జాతీయ మార్కెట్లో మేడిన్ ఇండియా ఉత్పత్తిగా లక్షిస్తుందన్నారు. భారత్‌లో అమ్ముడయ్యే భారత్‌లో అమ్ముడయ్యే ప్యాసింజర్ వాహనాల్లో (కంపాక్ట్ విభాగం) 50 శాతానికి మించి వాటాను ఐ10 కలిగి ఉందన్నారు. వచ్చే ఐదేళ్లలో ప్రస్తుతం ఉన్న కంపెనీ మార్కెట్ వాటా మరింత పెరగనున్నదని సంస్థ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కిషోర్, రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పోలీసు సిబ్బందికి ఉమెన్ స్టాఫ్ వెయిటింగ్ హాల్ ప్రారంభం



విశాఖ సిటీః పోలీసు విభాగంలో మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు విశాఖపట్నం పోలీసు కమిషనర్ ఆర్.కె. మీనా పేర్కొన్నారు. బుధవారం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్‌నందు మహిళా సిబ్బంది కోసం ఉమెన్ స్టాఫ్ వెయిటింగ్ హాల్‌ను ప్రారంభించడం జరిగింది. సీపీ వెల్ఫేర్ నిధులతో వెయిటింగ్ హాల్‌ను నిర్మించి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏవి వెంకట రమణ (ఏడీసీపీ (అడ్మిన్), కె. సుబ్రహ్మణ్యం (ఏడీసీపీ (సీఏఆర్), ఎంఎం సాలోమన్ (ఏసీపీ (సిఏఆర్), బి. స్వర్ణలత (ఆర్ఐ., వెల్ఫేర్), టివిఆర్‌కె కుమార్ (ఆర్ఐ., (అడ్మిన్) మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# మెకానికల్ ఇంజనీర్లు తమ నైపుణ్యాలను పెంచుకోవాలి

### నౌకా నిర్మాణ సంస్థ సిఇఓ గోపికృష్ణ శివమ్



సాగర్‌నగర్ః దేశ పారిశ్రామిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసు కుంటున్నాయని అదే సమయంలో అపారమైన ఉద్యోగ అవకాశాలు ఎదురు చూస్తున్నాయని వీటిని సొంతం చేసుకోవడానికి మెకానికల్ ఇంజనీర్లు తగిన నైపుణ్యాలను పెంచుకోవాలని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మేరీటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీకృష్ణ శివమ్ పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశంలోని పరిశ్రమల మధ్య నెలకొన్న పోటీ వాతావరణం కారణంగా నైపుణ్యం గల మానవ వనరులు లభించడం సవాలుగా మారిందని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు, విద్యా సంస్థల నుంచి బయటకు వచ్చే యువత నైపుణ్యాలకు మధ్య పొంతన కుదరడం లేదన్నారు. ఈ కారణంగా విద్యాలయాలు పరిశ్రమలతో ఎల్లప్పుడూ సంబంధాలను కొనసాగిస్తూ తగు మార్పు చేర్పులతో విద్యార్ధులకు ఆధునిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఆటోమొబైల్ పరిశ్రమలతో పాటు మొబైల్ ఉత్పాదక పరిశ్రమలతో పాటు మొబైల్ ఉత్పాదక పరిశ్రమలలో వస్తున్న మార్పులను నాలుగవ పారిశ్రామిక విప్లవంగా భావించాలని ఆయన పేర్కొన్నారు. తమ సంస్థ ద్వారా నౌకా నిర్మాణ రంగంపై ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలను ఆయన వివరించారు.

కార్యక్రమానికి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎమ్.ఆర్.ఎస్.సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

# సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శన ప్రారంభం

### ముఖ్య అతిథి తార చౌదరి



విశాఖ సిటీః చీరకట్టు మగువకు మరింత వన్నె తెస్తుందని వర్ధమాన నటి తార చౌదరి అన్నారు. బుధవారం నగరంలో హస్తశిల్పి ఆర్టిషన్స్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రీన్ పార్క్ హెూటల్‌లో నిర్వహించిన వస్త్రప్రదర్శనకు ఆమె ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని అనేక నగరాల నుంచి కొలువు దీరిన విభిన్న రకాల సిల్క్ చీరలు ఎంతగానో తనను ఆకట్టుకున్నాయని అన్నారు. భారత సాంప్రదాయానికి చిహ్నం మగువ చీరకట్టు అని ఆమె పేర్కొన్నారు. నిర్వాహకులు అభిమాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ వరకు ఈ వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందని అన్నారు. 65కు పైగా స్టాల్స్ ఈ ప్రదర్శనలో ఉన్నాయని తెలిపారు. చేనేతకారులు, చేతిపని బృందాలు, పట్టు సహకార సంస్థలు విభిన్న రకాల ఉత్పత్తులు ఇక్కడ లభ్యమవుతాయని పేర్కొన్నారు. దేశంలో గల అనేక నగరాల నుంచి మైసూర్ సిల్క్ సారీస్, రా సిల్క్, కాంచీపురం, ధర్మవరం, టస్సర్ వంటి వేలాది రకాల సిల్క్ చీరలు, డిజైన్ చీరలు అందుబాటులో ఉంచామని తెలిపారు.

## త్వరితగతిన

# రహదారి పనులు పూర్తి చేయాలి

- మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ ద్రోణంరాజు శ్రీనివాస్ రావు



విశాఖ సిటీః ప్రజల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల పై ప్రత్యేక దృష్టి సారించాలని విఎంఆర్డిఏ చైర్పర్సన్ ద్రోణంరాజు శ్రీనివాస్ రావు అధికారులకు ఆదేశించారు. బుధవారం విఎంఆర్డిఏ కమిషనర్ పి. కోటేశ్వర రావు తో కలసి ఎన్.హెచ్.16 నుండి విశాఖ వాలీ స్కూల్ మీదుగా బీచ్ వరకు 5.93 కోట్ల రూపాయలతో చేపట్టనున్న 1.60 కి.మీ లు గల 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారి పనులను పరిశీలించారు. ఈ రహదారి కి కావలసిన అనుమతులన్నీ లభించాయని త్వరలో పనులు పూర్తి చేయాలని సూచించారు. రహదారి నిర్మాణం వలన నష్ట పోయిన విశాఖ స్కూల్ తరగతి గదులకు, టాయ్లెట్లకు, ఫుడ్ క్రాఫ్ట్ ఇన్స్టిట్యూట్ , బాలికల జువైనల్ హోంకు సంబంధించిన గదుల నిర్మాణాలకు మరో 2.41 కోట్ల రూపాయలను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ పనులకు టెండర్లు ఫైనల్ స్టేజ్ లో ఉన్నాయని, వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

విఎంఆర్డిఏ ద్వారా చేపట్టిన పనులన్నీ త్వరితంగా పూర్తి చేసి విశాఖ ను రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి గారి ఆశయాల మేరకు అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. త్వరలో ముడసర్లోవ, కైలాసగిరి పనులను కూడా ప్రారంభించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని, దీని ద్వారా పర్యాటకులను ఆకర్షించడమే కాక విశాఖను పర్యాటక రంగం లో కూడా అభివృద్ధి చేసే దిశగా కృషి చేయాలని అన్నారు.

అనంతరం విఎంఆర్డిఏ ద్వారా చేపట్టి పూర్తయిన, ప్రస్తుతం జరుగుతున్న, గ్రౌండ్ కావలసిన రహదారుల పనుల పై కూడా ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమం లో ఎస్.ఈ రామ్మోహన్ రావు, ఈ ఈ మురళీకృష్ణ, విశాఖ వాలీ స్కూల్ ప్రొఫెసర్ తిమ్మారెడ్డి, ప్రిన్సిపల్ వల్లినాథ్, జువనైల్ హోం సూపరింటెండెంట్ సునీత, ఫుడ్ క్రాఫ్ట్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపల్ రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీపిసిలో స్వచ్ఛత పక్వాడి కార్యక్రమం

### ముఖ్య అతిథిగాసిజిఎమ్ సుదర్శన్ బాబు హాజరు



పరవాడ: నేషనల్ దర్మల్ పవర్ కార్పోరేషన్ లిమిటిడ్ (ఎన్‌టి పిసి)లో నిర్వహించిన స్వచ్ఛత పక్వాడిలో బాగంగా సమన్వయ భవనంలో బాగంగా ఎడ్మిషన్ గేటు నుండి ప్లాంట్ గేటు వరకు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిజిఎమ్ వి. సుదర్శన్ బాబు హాజరై ఏడ్మిస్ట్రేట్ బిల్డింగ్ ముందువైపు శుభ్రపరిచి అందంగా తయారు చేయమని చెప్పారు.




ఈ శ్రమదాన కార్యక్రమంలో సుమారు 50మంది సింహాద్రి ఉద్యోగులు పొల్గొన్నారు. సిహెచ్ పి ఏరియాలో ఉన్నటువంటి అయల్ షెడ్ ఏరియా అంతా శుభ్రపరిచి సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఈ కార్యక్రమంలో అర్ ఎల్ ఐటిఏడియస్ ఎన్ కె ఎల్ పి ఉద్యోగులు కూడా వారివారి ప్రాంతాల్లో శ్రమదానం చేశారు.

## రెండోరోజు నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబై: అమెరికా, చైనా మధ్య తాజా వాణిజ్య యుద్ధ ఆందోళనలతో భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టాలతో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ సెన్సెక్స్ 268 పాయింట్లు, 0.72 శాతం నష్టపోయి 37,060 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ నిఫ్టీ 98 పాయింట్లు, 0.89 శాతం నష్టపోయి 10,019 వద్ద స్థిరపడింది. హీరో మోటోకార్ప్, మారుతి సుజుకీ, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా షేర్లు లాభాలతో ముగిశాయి.






# నగరంలో వివిధ ప్రదేశాలలో హెచ్‌పీసీఎల్ స్వచ్ఛతా కార్యక్రమాలు






విశాఖపట్నంః ఆగష్టు 16 నుండి 31 వరకు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారు నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్షోత్సవాలలో భాగంగా బుధవారం నాడు స్కిల్ డెవలప్ మెంట్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆటో ర్యాలీని సీనియర్ మేనేజరు జె. మహేష్ జండా ఊపి ప్రారంభించారు. ఆరిలోవ, మధురవాడ కేంద్రాల విద్యార్థులు తెన్నేటి పార్కు, మద్దిలపాలెం ఆర్టీసీ డిపో, ఉడా ప్రాంగణం వద్ద పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించి అక్కడి ప్రజలకు స్వచ్ఛత అవసరం పట్ల అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పల్లి శ్రీనివాస్, కిరణ్, అధ్యాపకులు, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com